ఆదివారం

ప్రజాశక్తి

జూన్ 5, 2005



చేపా.. చేపా...

చేపమందు నిజమేనా!?

హ్యాపీ బర్త్‌డే

5.6.2005 నుంచి 11.6.2005 వరకు

జగదీష్(మణి)
4సం॥, 5.6.2001
సంతోష-వెంకటేష్
ఆరుట్ల-రంగారెడ్డి

సుహాస్
3సం॥, 6.6.2002
సుకన్య-రామకృష్ణ
హైదరాబాద్

అనూష
8సం॥, 6.6.1997
శంకరమ్మ-కృష్ణయ్య
తుమ్మలూరు-రంగారెడ్డి

సృజన
1సం॥, 6.6.2004
రామలక్ష్మి-శ్రీనివాస్
సామర్లకోట-తూ॥గో॥

లలిత్ ఆనంద్
6సం॥, 6.6.1999
విజయకుమారి-రాములు
అనంతవరం-ప్రకాశం

శైలూష
1సం॥, 7.6.2004
కవిత-శ్రీధర్
మధిర-ఖమ్మం

మానవి
2సం॥, 7.6.2003
శ్రీలత-మధు
బాలాజీనగర్-విజయనగరం



రవితేజ
3సం॥, 7.6.2002
అరుణకుమారి-సూర్యనారాయణ
పెద్దగదిలి-విశాఖపట్నం

వంశీకృష్ణ
ఉమారాణి-నర్సింములు
పరిగి-రంగారెడ్డి

నేహ
1సం॥, 11.6.2004
పుష్ప-ఖలీల్
జగ్జీవన్‌రాంనగర్-మ॥నగర్



రీడర్స్ మెయిల్



ఆవకాయ బాగుంది!

22వ తేదీ ఆదివారం కవర్‌స్టోరీ "ఆవకాయ తెలుగు రుచికి చిరునామా" బాగుంది. సాహిత్య గుభాళింపుతో తెలుగువాడి అద్భుత తయారీ ఆవకాయ గురించి మంచి కథనం. మాచే చాలా ఆసక్తిగా చదివించింది. మనలోమాట అనుబంధానికే హైలైట్‌గా ఉంది. అనుబంధం ఆద్యంతం ఆసక్తికరంగా ఉంది.

సొల్జేటి సైదాచారి, బాలెంల,
నల్లగొండజిల్లా.

ఆవకాయ చరిత్ర గమ్మత్తుగా ఉంది

ఈ వారం కవర్‌స్టోరీ ఆసక్తికరమే కాదు ఆశ్చర్యకరంగా కూడా అనిపించింది. ఎందుకంటే ఆవకాయ వెనుక ఇంత చరిత్ర ఉందని ఎవరూ ఊహించలేరు. ఆవకాయ లాంటి ప్రత్యేక తయారీలు ఆయా ప్రాంతాల ప్రజల జీవన సాంస్కృతిక చరిత్రను తెలియజేస్తాయి. అసలు పచ్చడి పుట్టుక గురించి మన దేశం నుంచి టైగ్రిస్ దీవులకెళ్ళిన మన దోసకాయలే మొదటి పచ్చడి రూపం దాల్చాయని చదువుతుంటే విస్మయం చెందాము. ఆవకాయ ఎలా తయారు చేయవచ్చో కూడా రాయడం ఎంతో సముచితంగా ఉంది.

ఎం రాజేశం, లక్ష్మీతాయారు,
ఎర్రగొండపాలెం, ప్రకాశంజిల్లా.

తెలుగు రుచి

కవర్‌స్టోరీ మమ్ములను ఎంతో ఆకట్టుకుంది. "పంచె కట్టుటలోన ప్రపంచాన మొనగాడు...అవకాయ వియోగమసలే సైపనివాడు" అని సినారె తన కవితలో చెప్పారన్నది ఈ కవర్‌స్టోరీలో చక్కగా ఇమిడ్చి చెప్పడం బాగుంది. 'కనదగు నెవ్వరు గీచిన' లో కార్టూన్‌లు ఆకట్టుకునేలా ఉన్నాయి.

-సిరిపురపు రామకోటేశ్వరరావు,
ఎనికేపాడు, విజయవాడ రూరల్

ఎడబాటు చేస్తున్న మినీ భూతం!

"ఎడబాటు" కథ ఈనాటి సమాజంలో కొందరు స్త్రీలు టీవి సీరియల్ మోజులో పడి మానవ సంబంధాలను, సొంత బంధువులను చివరికి కట్టుకున్న భర్తను ఎంత నిర్లక్ష్యం చేస్తున్నారో సరోజ పాత్ర ద్వారా తెలియజెప్పారు. ఇలాంటి స్త్రీలకు ఈ కథ ఒక గుణపాఠం. జీవనశైలి శీర్షికలోని "పిల్లలు కాదు పిడుగులు" అనే వ్యాసం కూడా బాగుంది. ఈనాటి పిల్లలు పాశ్చాత్య సంస్కృతి మోజులో పడి ఎటువైపు పరుగిడుతున్నారో రచయత చక్కగా వివరించారు. ఈ వ్యాసం తల్లిదండ్రులు కూడా తమ పిల్లలను ఎలా క్రమశిక్షణగా పెంచాలో మార్గం సూచించే విధంగా ఉంది. అతిగారాబం ఎంతచేటు చేస్తుందో కూడా చక్కగా వివరించారు.

జి వి నాగయ్య,
ఎర్రగూడూరు, కర్నూలు జిల్లా

ఎడబాటు

టీవీ సంస్కృతి మనుష్యుల మధ్య ఎలా దూరాల్ని కలిగిస్తోందో వర్ణించింది. ఈ టీవీ కార్యక్రమాలు సరోజను స్వయానా ఆమె అత్తమామలు వచ్చినా వాళ్ళను సరిగా పలుకరించనివ్వలేదు. అంతటి కనిపించని తెరలను, పొరలను కమ్మిన టీవీ, దాని సంస్కృతి పై మంచి కథ ఇది.

రమేష్‌బాబు, జవహర్‌నగర్,
చిక్కడపల్లి, హైదరాబాద్

పిల్లలు కాదు...

ఈ వారం జీవనశైలి శీర్షికలో "పిల్లలు కాదు పిడుగులు" ఐటమ్‌లో పిల్లలలా తయారు అవ్వడానికి ఎవరు కారకులో చక్కగా వివరించారు. ఎక్కువ మార్కులు తెచ్చుకోవాలని, బాగా చదవాలని ఈ తల్లిదండ్రులు అనుకోవడమూ, అందుకు వారు ఏదడిగినా తెచ్చి ఇవ్వడం చేస్తున్నారు. ఇదే అలవాటై నిజంగా వారికి అవసరం లేనిది, హానికరమైనది ఇవ్వడానికి తిరస్కరిస్తే ఆత్మహత్య చేసుకుంటామని బెదిరింపులకు దిగుతున్నారు. ఒక్క సంతానంతో సరిపెట్టుకోవడంలోంచి కూడా ఏర్పడే వాతావరణంలో పెంకిపిల్లలు, ఎదుటివారు చెప్పేదాన్ని వినాలనే గుణంలోపించిన పిల్లలు తయారవ్వుతున్నారు.

మురళీధర్, ఖైరతాబాద్, హైదరాబాద్

ఇంతి సంగతులు

ఈ వారం 'నాడు-నేడు' అనే రచన ద్వారా ఆడవాళ్ళ దుస్తుల గురించి, చక్కటి చర్చ నడిపారు. విద్యార్థినులమైన మాకు ఈ డ్రెస్ చాలా అనుకూలంగా ఉంది. మాకే కాకుండా ఈ డ్రెస్ అనేది నేటి మహిళలకు అన్ని సందర్భాలలోనూ సౌకర్యవంతంగా ఉంటుంది. ముందుముందు మేం గృహిణిగా మారినప్పటికీ వేషదారణలో డ్రెస్‌ను కొనసాగించవచ్చనే మనోధైర్యం ఈ రచన ద్వారా కలిగింది.

జె శ్రావణి, ఆడమ్స్ ఇంజనీరింగ్
కాలేజి, పాల్వంచ.

నాడు-నేడు

ఇంతిసంగతుల్లోని చీరలోని హుందాతనం, సాంప్రదాయం, సంస్కారం...డ్రెస్ వేసుకున్నందువల్ల కూడా ఉంటాయని తెలియజేయడంలో రచయిత్రి సఫలీకృతులయ్యారు. ఆధునిక మహిళ వస్త్రధారణలో చీరనే కాక డ్రెస్‌ను కూడా ధరించవచ్చు అనిచక్కని సందేశం ఇవ్వడం ద్వారా మాకున్న అపోహలు తొలగిపోయాయి.

సి హెచ్ సీత, కొత్తగూడెం, ఖమ్మంజిల్లా

ఆరోగ్యం పేజీ బాగుంది

ఈ వారం ఆరోగ్యం పేజీలలో 'అతిసార వ్యాధి' గూర్చి వ్యాసకర్త చక్కగా రాశారు. నిరోధం-జాగ్రత్తలతో అందరికీ ఉపయోగకరమైనదిగా రాయడం బాగుంది. బాలలకథ 'పిట్టకొంచెం కూత ఘనం' బాగుంది.

బి మధుసూధన్ సునీత, కర్నూలు.

ప్రపంచ కుటుంబ దినం

గత వారం సంచికలో ప్రపంచ కుటుంబ దినోత్సవ విశిష్టత గురించి చాలా బాగా రాశారు. కుటుంబం ఎట్లా ఆవిర్భవించిందో రాయడమే కాక మన పురాణ సాహిత్యాలలో కుటుంబ విధానాలను సోదాహరణంగా రాయడం బాగుంది. దీనివల్ల చాలా విషయాలు తెలుసుకున్నాం. "విడిపోయి కలుసుందాం" కథలో రాఘవయ్య కుటుంబంలో పిల్లలు పెద్దవాళ్ళయి విడిపోదామనుకుంటే ఏఏ పరిణామాలు ఎదురయ్యాయో చక్కగా వర్ణించారు. ఆరోగ్యం, పుస్తకంపరిచయం ఇలా అన్ని శీర్షికలలో కుటుంబం గురించే రాయడం ఆకట్టుకుంది.

ఎం లలిత, కంచరాం,
శ్రీకాకుళం జిల్లా

మృగశిర

మృగశిర అంటే చిన్నప్పుడు నాకెంతో ఇష్టం. నాలాగే నా స్నేహితులకూనూ. అప్పటికి ఆకాశం మబ్బులు కమ్ముకొంటుంది. వాతావరణం చల్లబడుతుంది. ప్రాణానికి హాయిగా ఉంటుంది. కాని పిల్లలమంతా మృగశిర కోసం ఎదురు చూడటానికి మరో కారణం ఉండేది. మృగశిర కార్తె ప్రవేశించిన రోజున చిన్న సైజు సంబరం చేసుకొంటారు. ఆ రోజు మాంసాహారం తినాలనే నియమం మాకు భలే నచ్చేది. మృగశిర అనగా ముర్గా యా శిరా అంటే కోడి లేదా మేక తలకాయ అని ప్రతి పదార్థం చెప్పేవారం. ఆ రోజు కోడి గానీ, మేకతల గానీ తినాలి గాబట్టే మృగశిర అనే పేరొచ్చిందని ఢంకా బజాయించి చెప్పేవాళ్లం. ఉర్దూలో ప్రసాద్ అని రాసి పర్సాద్ అని కూడా చదవొచ్చు కనుక మా వాదనతో పెద్దవాళ్లంతా తికమక పడిపోయేవారు. మృగం అంటే క్రూర జంతువు లేదా మరేదయినా జంతువు కావచ్చునీ, జింకను కూడా మృగం అని అంటారని అప్పట్లో మాకు తెలీదు. తెలిసుంటే మృగశిరకు మాకు నచ్చిన అర్థం అలా దబాయించి చెప్పగలిగి ఉండేవాళ్లం కాదు. హాఫ్ నాలెడ్జికి ఉండే గొప్పదనం అదేమరి.

మృగశిర రోజున కొన్ని ప్రాంతాల్లో చేపలు వండుకుని తింటారు. 'ముర్గా శిరా మే ఏ మచిలీ కహాంసే ఆగయే' అని ఎవరైనా అడిగితే మాత్రం మా దగ్గర సమాధానం ఉండేది కాదు. వెర్రి మొహం వేసేవాళ్లం. మెల్లిగా అక్కడ్నుంచి జారుకొనే వాళ్లం. హైదరాబాదులోనయితే చేపల మార్కెట్లు ఆ రోజు యమ రద్దీగా ఉంటాయి. రేట్లు ఆకాశాన్నంటుతాయి. వంటా తంటా లేకుండా గుటుక్కున మింగేసే చేప పిల్లల కోసం వెదికే జనం కొందరుంటారు. ఆ చేపల్లో బత్తిని సోదరులు ఏదో మందు పెడ్తారట. మందుతో ఉన్న చేపమింగితే ఉబ్బసం నుటుమాయం అవుతుందట. నాకు తెలిసి మా చుట్టాలు పక్కాలు చాలా మంది చేపమందు మింగారు. చేప ఏమయిందో, మందు ఏమయిందో తెలీదు కాని ఉబ్బసం మాత్రం దర్జాగా ఉండిపోయింది. కొర్రమీనుకు ఉపద్రవం ముంచుకొచ్చింది. దున్న ఈనిందంటే దూడను కట్టేయమన్నట్లుంది మన సర్కార్ల ధోరణి. పబ్లిసిటీ యావ తప్ప చేపమందులో ఉన్న శాస్త్రీయత ఎంతో పరిశీలించే బాధ్యత తనకు లేదనుకొంటున్నాయి.

చేప మందులో ఏముందో బత్తిని సోదరులు చెప్పరు. చేప మందు మృగశిర రోజే ఎందుకు వేసుకోవాలో అసలు చెప్పరు. శాఖాహారులకు బెల్లంలో కలిపిన మందు పనిచేస్తే మాంసాహారులకు మాత్రం ఎందుకు పని చేయదో సెలవివ్వరు. ఇదంతా చూస్తుంటే తెలిసీ తెలియని రోజుల్లో మృగశిరకు మేము ప్రతిపదార్థం చెప్పి దబాయించినట్లే ఉంది కదూ ఈ వ్యవహారం. అది తలుచుకొని బాల్యంలోనే మేమెంత గొప్ప వాళ్లమో అని ఆనాటి

మా మిత్రబృందం పొంగిపోతుంటుంది.

❖

ఈ సంచికలో . . .

ఓరా! ...	3
కార్టూన్ కదంబం... ...	4
కవర్ స్టోరీ ...	5
జీవనశైలి ...	10
బాలల కథ ...	11
బాలనేస్తాలు ...	12
ఇంతి సంగతి ...	16
కచేరి ...	17
ఆరోగ్యం ...	18
పుస్తక పరిచయం ...	21
న్యాయసలహాలు ...	24

ఇంకా...

కళ కంట కన్నీరు

కథ .. 8, 9

ఆ టీచర్ దాన... వీర....

రియల్ స్టోరీ ... 14, 15



పర్యాటకులకు ...రం కర్నూలు జి...

టూరిస్ట్‌గైడ్ ... 14, 15

సునీల్‌దత్

కళాసాహితి . . . 22, 23

ఓరా!

రాడార్ మెదళ్ల పక్షులు



రోజుల తరబడి, ఊళ్ళూపూళ్ళూ దాటి, సముద్రాలూ ఏరులూ దాటి ఎగరాలి. సరిహద్దులు పాటించని ఆ ప్రయాణానికి రాత్రీ-పగలు, అలుపూ-సొలుపు లేకుండా సాగాలి. రైళ్ళో, బస్సులో, విమానాలో ఇతరత్రా వాహనాలో అయితే హెడ్‌లైట్లో మరేతర ఏర్పాట్లో ఉంటాయి గానీ.... ఆకాశ మార్గాన దేశం విడిచి ఇతర ప్రాంతాలకు వలసపోయే పెంగ్విన్‌లాంటి పక్షులకెట్లా సాధ్యమయ్యిందా అని జర్మనీ ఓల్డెన్‌బర్గ్ యూనివర్సిటీవారు, డ్యూక్ యూనివర్సిటీ మెడికల్ సెంటర్‌వారు బుర్రలకు పనిపెట్టి ఆ పక్షుల బుర్రలకే రాడర్ అంతటి పవరుందని కనుగొన్నారు. చాలా వరకూ ఈ సాంగ్ బర్డ్స్ రాత్రిపూటే వలస వెళ్లడానికి రెక్కలు విప్పుతాయి. ఎంతటి చిమ్మచీకట్లోనైనా భూవాతారణపు అయస్కాంత శక్తిని బట్టి తమ దారిని కనుగొంటాయిట! వాటి మెదళ్లే రాడారుల్లా పనిచేసి దారి చూపెడతాయట. శాస్త్రజ్ఞులు పిలిచే క్లస్టర్-ఎన్ అనే దానివల్ల ఆయా పక్షులకు సాధ్యమవుతుందని అంటున్నారు.

ఆన్ డ్యూటీ... ఆఫ్ డ్యూటీ!

దొంగ-పోలీసు ఆటలో ఇద్దరూ ఉంటే ఆట సాగుద్ది. ఇద్దరూ ఒకరే అయితేనో...?! ఏమౌతుందో జైపూర్ పోలీసుకానిస్టేబుల్ గోపాల్‌సింగ్‌ను అడిగి తెలుసుకోవాలి. అంత కచ్చితంగా గోపాల్‌సింగే ఎందుకు చెప్పగలడంటే...ఓ చిన్న ఫ్లాష్‌బ్యాక్కుంది మరి! ఇటీవల జైపూర్‌లోని ఏనుగుల శాల ఆవిష్కరణోత్సవం పెద్దపెట్టున జరిగింది. ఆ సంరంభంలో కిక్కిరిసిన జనసందోహం. వారి సందడిలో వారుండగా వారి జేబుల సంగతి ఏ సవ్వడి రాకుండా సవరించారు కొందరు. ఎవ్వరా చోరశిఖామణులని అనుమానితులను పట్టుకున్నారు. వారి జేబుల ఎత్తు, లోతులను కొలవగా ఒక చోరసామ్రాట్టు వద్ద మాత్రమే పోయిన వారందరి డబ్బూదస్కం, నగలునట్రా దొరికాయి. ఎవరా చోరాగ్రేస అని తరచి చూడగా ఆఫ్ డ్యూటీలో ఈ డ్యూటీ చేసిన పోలీసుకానిస్టేబు శ్రీమాన్ గోపాల్‌సింగేనట. మరంచేత దొంగాపోలీస్ గప్‌చుప్ సంబారుబుడ్డీ...ఎక్కడి దొంగలక్కడే గప్‌చుప్. ఎందుకంటే తమనెక్కడ పోలీసనుకుంటారోనని దొంగల భయం!



"ఆరోగ్యానికి రక్ష ఇస్తుంది స్థంభమెక్కుడూ"



"స్టీలు స్థంభమెక్కడో ఆరోగ్యమక్కడా.." అని లైఫ్‌బాయ్ ఎడ్వర్‌టైజ్‌మెంట్ లెవల్లో హాంకాంగ్ జనాలు పాడుకుంటున్నారు. ఓ పద్నాలుగు మీటర్ల స్టీలు స్థంభానికి వెయ్యికు పైగా తీపితీపి బన్నులు కట్టి పొలోమని ఎక్కమంటారుట. చేపల దీవిగా పేరొందిన చేవుంగ్ చౌ దీవిలో ప్రతీ ఏడాది ఈ స్థంభారోహణోత్సవం జరుపుతారు. ఎందుకోగానీ ఇటీవల వరకూ దానిని నిషేధించారు. ఇటీవలే మళ్ళీ పునరుద్ధరించాక రెట్టించిన ఉత్సాహంతో ఎక్కిదిగి స్వీటు బన్నులు తిని ఆరోగ్యానికి ఆరోగ్యం, సంబరానికి సంబరం అంటున్నారు. ఒకేసారి వందమంది ఎక్కి ప్రాణాలమీదకు తెచ్చుకున్నా... ఉత్సవం ఉత్సవమే నంటున్నారు.

కార్టూన్ కదంబం

మీకు పోటీగా ఆవిడా ఉన్నారు మేడమ్..!
కాంగ్రెస్ అధ్యక్షురాలిగా తిరిగి సోనియా

ఎలాగూ నాగలి పట్టారుగా ఒకపూట నా పొలంలో పనిచేస్తే సంతోషిస్తా సారూ...!

నా తెలంగాణా..!
రెడీ... స్టార్ట్ కెమెరా... యాక్షన్


మున్సిపల్ ఎన్నికలు
చేపమందు పంపిణీ

“అనగనగా ఒక రాజుకి ఏడుగురు కొడుకులు. ఆ ఏడుగురు ఒకనాడు వేటకెళ్ళి ఏడు చేపలు తీసుకొచ్చారు. ఆ ఏడు చేపల్నీ ఎండబెట్టారు. అందులో ఒక చేప ఎండ లేదు. అనడిగితే...గడ్డివాము అడ్డు...”ఈ కథ మన చిన్నప్పటినుంచీ వింటున్నదే. ఇప్పుడా చేప మరింత సెన్సేషనల్ కథ అయ్యింది. మూలికా మందు నోట కరిచి మనిషి నోట్లోంచి లోపలికెళ్ళి, శరీరంలో ఈది ఆస్త్మాను తుడిచిపెట్టే చేప అయ్యింది. ఈనాటి బత్తిని సోదరుల చేప “మందు వింత” అయ్యింది.

చేపా...చేపా...చేపమందు నిజమేనా!?

ఉదయశంకర్

“ఓ రెండు అంగుళాల చేప అతని రెండువేళ్ళ మధ్య తపతపా కొట్టుకుంటోంది. దాని నోట్లో పసుపు రంగులో ఉన్న మూలికాచూర్ణం కూర్చారు. నా నోరు బాగా తెరచి పట్టుకున్నారు. చేపను పట్టివుంచిన రెండువేళ్ళ చేయి నా నోట్లోకంటా వెనుక దంతాల వరకూ జొప్పించి బతికున్న చేపపిల్లను వదిలారు. వెగటు పుట్టే టైమివ్వకుండా ఆ చేపపిల్ల అన్నవాహికలోకి జారి, నా శరీరంలో ఈదడానికి వెళ్ళిపోయింది....ఇంతకీ ఇదంతా దేని గురించనుకుంటున్నారు? ప్రఖ్యాతిగాంచిన బత్తిని సోదరుల చేపమందు గురించే” ...ఇదీ షోనార్‌జోషి అనే వ్యాసకర్త రాసిన వెబ్‌సైట్ వ్యాసం ఉపోద్ఘాతం.

ఇంటర్నెట్టు వినువీధులలోనే కాదు, కొద్ది ఏళ్ళక్రితం స్వయానా ఒక రాష్ట్ర ముఖ్యమంత్రి హోదాలో చంద్రబాబు నాయుడు, మరికొందరు మంత్రులు ఆ చేపమందు వేసుకోవడమే కాదు...వేసుకుంటున్నట్లు మీడియాకు ఫోటోఫోజులు కూడా ఇచ్చి ఇతోదిక ప్రచారానికి తోడ్పడ్డారు. ఇక ఏ ఇజమూ లేదు టూరిజమే అన్న చంద్రబాబు నాయుడు గారే ఆంధ్రప్రదేశ్ టూరిజం వారి ప్యాకేజ్‌లో ఒక ఆకర్షణీయ అంశంగా “హైదరాబాద్ బత్తిని సోదరుల చేపమందుతో ఆస్త్మా రోగ విముక్తి” అని చేర్చారు. ప్రభుత్వపరంగా ఇంతకుమించేం కావాలి?! బహుశా అమెరికాలో ఫ్లోరిడా వద్ద ఉన్న ఆర్లాండో & గైనెస్విల్లే వారి “అడ్వాన్స్‌డ్ ఫిష్ మెడిసిన్” వారి టూర్ పేకేజీ గురించిన వెబ్‌పేజీ ఊరించివుంటుంది. వారి ఆరు రోజుల కోర్సు గురించి ఓ పావు పేజీ రాసి రెండు పేజీల టూరిజం వివరాలు, లాడ్జిల, హోటళ్ళ, రిసార్ట్‌ల, చూడదగ్గ ప్రదేశాల, వాటికయ్యే ఖర్చుల, రవాణా సౌకర్యాల టారిఫ్‌ను ప్రచురించారు. దీనర్థం ఏవిటో అందరికీ తెలుసు తిర్మల్‌గిరి తిరందాసా! ఇప్పటికిప్పుడు “ఖోజ్‌హైదరాబాద్.కామ్” గానీ, “డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ. ఫిష్-మెడిసిన్.ఆర్గ్” గానీ వెబ్‌సైట్ బ్రౌజ్ చేసీ చేయగానే మందు ఇచ్చు తేదీ, స్థలం, కాలము...ఆ వెంటనే లాడ్జిల, 3నక్షత్రాల/5నక్షత్రాల హోటళ్ళ రూమ్‌లు, తిండి రేట్ల టారిఫ్‌లు, చూడదగ్గప్రదేశాలు వివరాలు వెలువడతాయి. చూసెదరు గాక!

కొరమీను చేపపిల్లల పాలిటి మృత్యుఘడియలు

సుబ్బిపెళ్ళి ఎంకి చావుకొచ్చిందన్నట్లు బత్తినివారి మందు ప్రయోగాలకు అపురూపమైన, ఖరీదైన కొరమీను జాతి చేపలు ఒకేరోజున లక్షలాదిగా బలవుతున్నాయి. వాటి చావు ముహూర్తం ఈ ఏడాదికి మార్గశిర కార్తె నక్షత్రయుక్త లగ్నమందు అనగా 2005 జూన్ 8వ తేదీ బుధవారం ఉదయం 9గంటల 20 నిముషాల నుంచి మర్నాడు 9గం॥20ని॥ల వరకూ మధ్యగల 24 గంటలూ అన్నమాట.

ఆ రోజున కొరమీను జాతి చేపపిల్లలు 2 నుంచి 2.5 అంగుళాల చేపపిల్లలు కొన్ని లక్షల సంఖ్యలో కావాలని బత్తిని సోదరులు ప్రభుత్వ మత్స్యశాఖవారిని అడిగారు. మేం అన్ని చేపలను సరఫరా చేయలేమని చేతులెత్తేశారు. బత్తిని సహోదరులు ముఖ్యమంత్రివర్యులు వై యస్ రాజశేఖరరెడ్డి గారిని కలిశారు. పురాణగాథలోని జనమేజయ మహారాజు చేసిన “సర్పయాగం” లాగా నేడు బత్తిని వారి మత్స్యయాగానికి కావాల్సిన కొరమీను బేబీలను ఎన్నికావాలంటే అన్ని సరఫరాకు తగు చర్యలు తీసుకోవాలని పశు సంరక్షణ-మత్స్య శాఖ ప్రధాన కార్యదర్శి ప్రియదర్శినీ దాస్ గారికి



బత్తిని సోదరులు



చేపమందు వారితో నాటి ముఖ్యమంత్రి

"చేప మందు అర్థంలేనిది"

-ప్రజాశక్తి సండే డెస్క్‌తో డా॥ శైలజ, మెడిసిటీ, హైదరాబాద్

ప్ర. ఆస్మా/ఉబ్బసం రోగులకు చేపమందు ఇస్తామంటున్నారు బత్తిని సోదరులు. వాళ్ళు డాక్టర్లు కాదుమరి. డాక్టరుగా మీ స్పందన...

డా॥శైలజ: ఆస్మా అనేది ఎలెర్జీకి సంబంధించింది. దుమ్ము-ధూళి వల్ల రావచ్చు, తినే పదార్థాల వల్ల రావచ్చు. కొంతమందికి చలిగాలి పడకపోయి రావచ్చు. అసలు ఆస్మా అనేది ఆ వ్యక్తికి వచ్చిందా, లేదా అనేది స్పైరోమిట్రీ అనే పరీక్ష ద్వారా మాత్రమే నిర్ధారించగలం. అలాంటిది వేలాదిమందిని లైన్లలో నుంచోబెట్టి, వాళ్లకు ఆస్మా వచ్చిందో రాలేదో నిర్ధారణ లేకుండా ఉబ్బసానికి మందంటూ ఇవ్వబూనడం అర్థరహితం.

ప్ర. ఆస్మా/ఉబ్బసానికి ఏఏ వైద్యవిధానాల్లో చికిత్స ఉందంటారు?

డాక్టర్: ఆయుర్వేదం, హోమియోపతి వైద్యవిధానాల గురించి నేను చెప్పలేను. ఎందుకంటే నేను అలోపతి వైద్యవిధానానికి చెందిన డాక్టర్‌ను. అలోపతిలో రకరకాల మందుల ద్వారా చికిత్స రోగనిర్ధారణ, తీవ్రతలు గురించి తెలుసుకున్నా తరువాత చేస్తాం. ఇంకా ఇతర పద్ధతులంటూ ఏవీ లేవు. గానీ ఈ మందులను క్రమంగా వాడుతూ యోగా చేయడం ద్వారా మరికొంత లాంగ్‌రన్‌లో ఉపయోగకరం అని మాత్రమే చెపుతాను. అలాగని ట్రీట్‌మెంట్ లేకుండా కేవలం యోగా మాత్రమే తగ్గిస్తుంది అనడం అశాస్త్రీయం.

ప్ర. మృగశిర కార్తె నాడు బతికున్న చేపను నోటిద్వారా పంపడం ద్వారా ఆస్మాకు చికిత్స చేస్తున్నాం అని బత్తిని సోదరులు వివరిస్తున్నారు.

డాక్టర్: చేప ద్వారా చికిత్స చేస్తాం అనడం అర్థం లేనిది. బేస్‌లెస్. బతికున్న చేప గొంతుద్వారా ఊపిరితిత్తుల్లోకి వెళ్లి, అక్కడున్న మ్యూకస్‌ను తినేస్తుంది అంటున్నారు. అది ఏవిధంగానూ జరగదు. పైగా అలా ఊపిరితిత్తుల్లోకి అలాంటివి వెళ్ళితే ఏ మానవుడూ ఊపిరి తీసుకోలేక మరణిస్తాడు. అది చాలా ప్రమాదకరం. కడుపులోకి వెళ్ళితే అది కొద్దిసేపటికే నిర్జీవం అయి జీర్ణమైపోతుంది. దానిద్వారా, లేదా ఆ చేపను గ్లావ్‌లు లాంటివి లేకుండా వేయడం ద్వారా అదనంగా అంటువ్యాధులు సోకే ప్రమాదం వుంది తప్ప మరే ప్రయోజనమూ లేదు.

ప్ర. పసుపురంగులో ఉండే మూలికా చూర్ణం చేప నోటిలో పెట్టి చేసే చికిత్సద్వారా ఉబ్బసం/ఆస్మా నయం అవుతుందని బత్తిని వారూ, వారి అభిమానులు అంటున్నారు.

డాక్టర్: చేపద్వారా చేస్తామంటున్న ఈ వైద్యానికి సైంటిఫిక్ బేస్ ఏమాత్రమూ లేదు. పైగా వీరి మందు శాంపిల్స్ టెస్ట్ చేస్తే వాటిలో స్టెరాయిడ్స్ ఉన్నాయని కనుగొన్నారు. ఉత్ప్రేరకాలను ఆ విధంగా ప్రయోగించకూడదు. అలోపతి వైద్యవిధానంలో ఇన్‌హేలర్ ద్వారా ఓరల్ స్టెరాయిడ్స్ ఇస్తాం. చాలా తక్కువ సందర్భాలలో నరానికి ఇంజెక్షన్ ద్వారా పేరెంట్రల్ స్టెరాయిడ్స్ ఇస్తాం. అదికూడా కేవలం 7 నుంచి 10 రోజులు మాత్రమే.

హుకుం జారీ చేశారు. ఆరోజు ఓ పెద్ద తిరుణాల వలే ఏర్పాట్లు నిమిత్తం ప్రభుత్వ రోడ్డు రవాణా శాఖవారు, రైల్వే శాఖవారు అన్ని విధాలైన ప్రయాణ ఏర్పాట్లు చేస్తున్నారు. నాంపల్లి స్టేషన్ దాపునే ఉన్న ఎగ్జిబిషన్ గ్రౌండును సర్వసన్నద్ధం చేస్తున్నారు. ప్రతీ ఏడాదిలాగే ఐదారు లక్షల మంది ఆస్మా రోగులు వివిధ రాష్ట్రాలనుంచి, రాష్ట్రం నలుమూలల నుంచి తామిచ్చే చేపమందుకోసం రానున్నారని బత్తిని వారు ప్రకటించారు.

చేపమందు వంశం బత్తిని వంశం

156 సంవత్సరాల క్రితం కల్లుగీసి అమ్మే బత్తిని వీరన్నగౌడ్ తెల్లగా నురుగులు పొంగే కుండడు కల్లు ఒళ్ళు విరుచుకు పనిచేసే వాళ్ళకు ఉచితంగా పోసేవాడు. వారి శారీరకశ్రమ మరిచిపోయి ఒళ్ళునొప్పులు పోతాయని భావించి ఆ పనివారికి ఉచితంగా పోసి ఆదుకునే మనస్తత్వం ఉన్నాయన. అతని స్వభావాన్ని గమనించిన ఒక పుణ్యపురుషుడు 1845వ సంవత్సరంలో కనబడి కొన్నిమూలికలను బహూకరించి ఆశీర్వదించారుట. దానితోపాటు దూద్‌బౌలీలోని వారింట ఒక నుయ్యిని కూడా మంత్రించి ఏర్పాటుచేశారు. ఆ బావినీటితో, వనమూలికలతో చేపమందు తయారీవిధం చెప్పి దీన్ని మృగశిర కార్తె రోజున ఆస్మా రోగులకు ఉచితంగా ఇచ్చి వారిని ఆ రోగం నుంచి కాపాడమని ఆదేశించారుట. ఆనాటి నుండి వీరన్న గౌడ్ వంశీయులే ఈ చేపమందుతో ఆస్మా రోగుల పాలిట అపర ధన్వంతరీలయ్యారు. వీరన్న నుంచి శివరామ్‌గౌడ్, ఆయన నుంచి శంకర్‌గౌడ్, అతని వారసులు ఐదుగురు కుమారులు కొనసాగించారు. సోమలింగం, హరినాద్, శివరామ్, విశ్వనాద్, ఉమామహేశ్వర్(బాబు)లు బత్తిని సోదరులుగా బహుళ ప్రచారంలో ఉన్నారు. వీరి తరువాత వీరి కుమారులు తయారుగానే ఉన్నారు. 156 సంవత్సరాల నుంచి ఇంతస్థాయి ప్రచారంగానీ, భారీ ఏర్పాట్లు గానీ లేవు. ఇటీవల ఈ చేపమందు వైద్యం ప్రభుత్వ, ప్రభుత్వేతర రూపాలలో ప్రచారం పొందింది. ఇంటర్నెట్టుకెక్కింది. వాదవివాదాలకు వేదికయ్యింది. అది మా వంశపారంపర్యమనీ బత్తినివారూ...ఇది ఎట్లా శాస్త్రీయమనీ జనవిజ్ఞానవేదికలాంటి సంస్థలవారు చర్చకు తెరతీశారు. ప్రచారానికి ఎక్కినకొద్దీ దానికి చెందిన భావజాలం కూడా వ్యాపిస్తుంది. 156 సంవత్సరాల క్రితం పాపమా పెద్దాయనకు ఏ ప్రచార పటాటోపంపై మక్కువ లేదు. తనకు తెలిసినదేదో ఆస్మా పీడితులకు ఇంత మందు ఇచ్చి ఉపశమింపజేద్దామని అనుకుని ఉంటారు. ఇది పనిచేసి తీరుతుంది. మీరింకేం వైద్యకాలు చేసుకోనక్కర్లేదని అల్టిమేటమ్‌గా చెప్పలేదు. ఒకటిన్నర శతాబ్దం క్రితం శాస్త్రసాంకేతిక పరిజ్ఞానం లేని రోజున ఏ మందూ మాకూ లేనిరోజున ఏ ఆకుపసరో తింటే ఏమన్నా ఉపశ మనం దొరుకుద్దే మోనని ఆశపడే వారు. అంతకు మించి ఏ దురుద్దే శాలూ ఉండేవి కావు. ఇప్పటి పరిస్థితి అది కాదు. శాస్త్రసాంకేతిక అభివృద్ధి చెందింది. మందులు మాకులు వచ్చాయి. సూపర్‌స్పెషాలిటీ వైద్యవిధానాలు వచ్చాయి. ఆస్మా/ఉబ్బసం రోగులకు అనేక మందులు వెలిసాయి. కానీ చింతించే విషయం ఏవిటంటే ఆ అభివృద్ధి, ఆ మందులూ, ఆ వైద్యసౌకర్యాలు సామాన్యమానవుడికి అందనంత పేటెంట్ చిటారుకొమ్మకు ఎగిరికూర్చున్నాయి. కంటిముందున్న వైద్యాలు అందుబాటులో లేకపోవడంతో...ఇదుగో ఇలాంటి చిట్కా వైద్యాలకు, మేజిక్-మెడికేషన్‌లకు ఆశపడి వెళుతున్నారు. రోజుల తరబడి క్యూలు కడుతున్నారు. ఒక నిస్సహాయ స్థితిలో ఉన్నవారిని మూఢనమ్మకాల కొలిమిలోకి నెడుతున్నారు.

సైబర్‌స్పేస్‌లో విహరించేంత అందల మెక్కిన ఓ ఊహాజనితం(నిరూపించనంత వరకూ దేని స్థాయి అయినా అదేమరి) ఎంత వర్ణించినా అది వినడానికి ఓ అద్భుత కథావిశేషంగానే ఉంటుంది. షోనార్ జోషిగారి వ్యాస ఉపోద్ఘాతం చదివాం కదా...ఓ చేపపిల్ల అన్నవాహిక ద్వారా మానవుని శరీరంలోకి ప్రవేశించి దాని డెస్టినేషన్ వరకూ ఈదుకుంటూ వెళుతూ...దారిలో ఉన్న ఉబ్బసరోగ కల్మషాన్ని ఛేదిస్తూ వెళుతుందిట. జోషీ గారి వర్ణనలోనే విందాం. "...శ్వాసనాళంలో ఉబ్బసవ్యాధికి చెందిన శ్లేష్మం(ఫ్లమ్)తో మూసుకుపోయిన రంధ్రాలను తెరుస్తూ ఈదుకెళ్ళే కొరమీను చేపపిల్ల, తన నోట కరిచి వుంచిన పసుపు రంగు మూలికా చూర్ణానికి (మందుకు) మార్గం తీస్తుంది. ఈ బతికున్న చేపను మింగిన పేషెంటు మూడు డోసుల మందు మూడు శుభప్రదములైన రోజులలో తీసుకోవాల్సివుంది. ప్రతీ పదిహేనురోజు లకొకసారి వచ్చే ఆరుద్ర కార్తె, పునర్వసు కార్తె, పుష్యమీ కార్తె శుభదినాలలో అంటే 45రోజుల వ్యవధిలో మందు వాడాలి. దీనిలో భాగంగానే ఈ నలుబదిఐదు దినములు లోపలనున్న సజీవచేపకు మించిన కఠినమైన ఆహారాన్ని తీసుకోకుండా పథ్యం చేయాలి." ఈ వర్ణనను మందు జాగ్రత్తగా వాడడం కోసం సాధారణప్రజల్ని అప్రమత్తం చేయడానికి అల్లిన అభూత కల్పన(మిత్) అందామా పోనీ! మందు పనిచేసేంత శక్తికలదా కాదా అన్నది మా చిలకలపూడి చిన్నారావుకెరుక... దాని మూలంగా ఓ మూఢనమ్మకం, దానికి దగ్గరగా ఉన్న ఇతర నమ్మకాల మీద గురి ఏర్పరచడమే కదా! మామూలు జనం తమ జీవనవేగంలో రోజువారి బతుకుపోరాటంలో ఇది ఎంత వరకూ అని తర్కించుకునే సమయంలేక పోబట్టి గానీ...వాళ్లే కనుక నిలదీసే ప్రశ్నలు వేస్తే ఎంతవరకు సత్యశోధనకు నిలబడతాయి. సాధారణ ప్రజల సంగతి అలా ఉంచండి...చదువుకున్న డిగ్రీల భుజకిరీటధారులైన వారు

ఇలా ఇరగదీసి రాస్తుంటే...ప్రముఖులైనవారు కూడా తమ అధికారహోదాలలో హాజరై పేపర్ల ఫొటోలలో కొలువుదీరుతుంటే...శాస్త్రీయంగా నిరూపింపని వాటిని మోర-బోర విరుచుకుని కొనసాగనివ్వడమే కదా! ఇదెంత వరకూ సమంజసం.

బహుశా ఈ పద్ధతిమూలంగానే అనేక చిట్కావైద్యాలు, తాంత్రిక వైద్యాలు, మేజిక్ థెరపీలు అన్ని రకాల మతాల ముసుగులో చలామణీలో ఉన్నాయి. క్రైస్తవ మత ప్రచార సభలలో కూడా ఇలాంటివి తరుచూ వింటుంటాం. ఫలానా మతబోధకుడు ప్రార్థన చేస్తూ..."నాయనా గాబ్రియేలు నీవు కుంటివాడివి కాదు...ఏసు పిలుచుచున్నాడు. లేచి నడుచుకుంటూ ఇక్కడకు రా" అంటారు. ఆ గాబ్రియేలు అనే వికలాంగుడు నడిచి వచ్చేశాడని పేపర్లు రాస్తాయి. మూగవారిని మాట్లాడించారనీ, గ్రుడ్డివారికి చూపునిచ్చారని వర్ణనలు వెదజల్లబడతాయి. గ్లాసుడు మంచినీళ్ళు పట్టుకుని ఫలానా దర్గా దగ్గర నిలబడితే నమాజు చేసివచ్చిన ముల్లా దానిలో గాలి ఊదుతారు. ఆ నీళ్లు రోగికి పట్టిస్తే ఎలాంటి రోగమైనా తగ్గిపోతుందని ప్రచారం గాలి దుమారంలా వ్యాపిస్తుంది. గుంటూరుజిల్లా పెదకాకాని దగ్గరున్న మసీదులో మానసిక వ్యాధిగ్రస్తులను కొద్దిరోజులు నిద్ర చేయిస్తే వారి రుగ్మత దూరమవుతుందని బహుళ ప్రచారం అయ్యింది. ఫలానా అమ్మవారి గుడి వద్దకు వేపమండలు తీసుకుని వెళితే అక్కడున్న పూజారివారు వేపమండలతో దిగదుడిస్తే చర్మవ్యాధి మాయం అవుతుందని ఆనోటా ఆనోటా ఊళ్ళన్నీ పాకిపోతుంది.

ఇలాంటివే కొద్దిపాటి నాజూకుతనం చేర్చుకున్న నమ్మకాలు చెలామణిలోకి వచ్చాయి. మరీ మోటుగా నాటుగా ఉంటే నమ్మేవాళ్ళూ నమ్మిచావరు మరి. చుట్టూ ప్రపంచంలో పెరుగుతున్న సైన్స్ ముందు కూడా అవి నిలబడాలికదా! అందుకని కొన్ని రకాల తాంత్రికవైద్యాలకు సైన్స్‌ను కూడా జోడిస్తున్నారు. సైన్స్ జోడించడానికి, నమ్మించడానికి వీలులేని వాటికి మా విశ్వాసం అనే కవచాన్ని తొడుగుతున్నారు. ఆ మధ్య ఉత్తరప్రదేశ్‌లో ఒక బాబాగారు కొద్దిపాటి ఎత్తులో ఉన్న దూలంపై కూర్చుని కాలు వేలాడేసి ఉంటాడు. మహామహా రాజకీయవేత్తలు, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఆనాటి ప్రధాని మంత్రికూడా వెళ్ళి ఆయన వద్ద కాలి తన్నుల ఆశీర్వచనాలు పొందారు. ఈ తన్నుల బాబా ఉదంతం ఎంత నవ్వుపుట్టించేది. అయినా నమ్మకం పేరున చెలామణీ అయిపోతూనే ఉంది. ఇదే ధోరణి వైద్యానికి చెందిన కొన్ని అంశాలు చెలామణీలో ఉన్నాయి. కొన్ని గిరిజన ప్రాంతాలలో రోగి నీడలో ఆయా అవయవం నీడపై కర్రతో పొడిచి నొప్పులు మాయం చేస్తారుట. మరో చోట కీళ్ళ నొప్పులకు సంబంధిత కీళ్ళ దగ్గర రూపాయి నాణెం వుంచి ఆక్యుప్రెజర్‌లాగా ఒత్తిడి కలిగించి కీళ్ళనొప్పులు తగ్గించే ఆశ్రమం ఉంది. అక్కడికి కూడా ఒక తిరునాళ్ళలాగా జనం వెళుతుంటారని ఒక వార్తాపత్రిక కవర్‌స్టోరీ వేశారు. ఇటీవల కాలం వరకూ ఆయిల్‌పుల్లింగ్‌పై అలాంటి కథనాలే వ్యాప్తి గాంచాయి. ఇప్పుడు కొంత శాంతించాయి. "ఇండియన్ మెడికల్ అసోసియేషన్"(ఐఎమ్ఏ), జనవిజ్ఞాన వేదిక లాంటి సంస్థలు బత్తిని సోదరుల చేపమందు విశ్వసనీయతపై అనేక ప్రశ్నలు లేవనెత్తుతూ ప్రకటనలు ఇస్తున్నారు. ఇటువంటి నిరూపణకాని పద్ధతుల్లో వైద్యం చేస్తామని ఎవరన్నా ప్రయత్నించినా, ప్రచారం చేసినా "డ్రగ్స్ & మేజిక్ రెమెడీస్ (అబ్జెక్టబుల్ ఎడ్వర్‌టైజ్‌మెంట్స్) చట్టం కింద శిక్షార్హులు అని క్రిందటేడాదే ప్రకటించారు. నిరూపణే కాని ఈ చేపమందు విధానానికి ప్రభుత్వం ఐదెకరాల స్థలం బత్తిని సోదరులకు కేటాయించడం ఏ మేరకు సబబని, అలా చేయడం మూఢనమ్మకంతో, అభూతకల్పనతో నిండివున్న చేప మందుకి ప్రోత్సాహమిచ్చినట్లే అవుతుందని అన్నారు. ఒక వేళ ఆ మందు శక్తివంతమైనదే అయితే ఎన్‌టిఆర్ మెడికల్ కాలేజీ, విజయవాడ, ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ నంస్థల ముందుకు వచ్చి నిరూపించుకోవాలని సవాల్ కూడా విసిరారు. మొత్తంగా ఈ చేపమందు విధానం చట్టవిరుద్ధమైంది,



ఆశాస్త్రీయమైంది, ఈ మందు వేయుటలో అంటువ్యాధులు వ్యాపించే ప్రమాదకరమైంది అని తీవ్రంగా విమర్శించారు. క్రిందటేడాది మందు శాంపిల్స్‌ను పరీక్షకు పంపితే చేపమందు పేరిట ఉపయోగిస్తున్న మిశ్రమంలో ఉత్ప్రేరకాలున్నాయని, అవి అనేక ఇతర ఇబ్బందులను కలుగుజేస్తాయని, మగవారిలో వంధ్యత్వం వచ్చే ప్రమాదంకూడా ఉందని తేలిందని జనవిజ్ఞాన వేదిక నాయకులు అంటున్నారు. నేటి ముఖ్యమంత్రి స్వయంగా ఒక డాక్టర్ అయ్యుండీ ఇలాంటి చేపమందు వైద్యానికి కావాల్సిన చేపల్ని సరఫరా చేయాలని ఆదేశించడం సరైంది కాదని అన్నారు. ఇవన్నీ మా నమ్మకం, మా విశ్వాసం అనేవారితో మనం ఏం చెయ్యాలేం. మాట్లాడలేం. నమ్మకం వేరు-నిజం వేరు. విశ్వాసం వేరు-వాస్తవం వేరు. కానీ మా నమ్మకాన్నే ఈ ప్రపంచమంతా నిజమని నమ్మాలి, మా విశ్వాసాన్నే ఈ లోకమంతా వాస్తవమని ఒప్పుకోవాలి అన్నప్పుడే సమస్య వస్తుంది. ఏదైనా ఒక విషయం, అనేక ప్రయోగాలకు నిలబడి ఎన్నిసార్లు చేసినా దాదాపు అదే ఫలితం రావాలి. అలా నిరూపితం అయినప్పుడే వాస్తవం అనీ, శాస్త్రీయమనీ అనంటారు. అలాంటి ప్రక్రియకు ఈ బత్తిని సోదరులు తమ చేపమందుతో ఎందుకు సిద్ధపడరు?! ✤

"సరైన వైద్యం ప్రజలకు అందకపోవడం వల్లే..."

–జనవిజ్ఞానవేదిక రాష్ట్ర అధ్యక్షులు **గేయానంద్**

బత్తిని సోదరులు చేపమందును ఎటువంటి ఆర్థిక ప్రలోభం ఆశించకుండా ఉచితంగా ఇస్తున్నారు కదా వ్యతిరేకించడం ఎందుకు అని కొందరు అంటున్నారు. చేపమందు దాతల ప్రచారం కూడా అలా అనుకునేలా చేస్తోంది. జనవిజ్ఞానవేదిక ఒక శాస్త్రీయ దృష్టితో వ్యతిరేకిస్తోంది. చేపమందుతో ఆస్త్మా నయమవుతుందనే ప్రచారంతో వేలాదిమంది ప్రజలను భ్రమల్లో ముంచడాన్ని మేము నిరసిస్తున్నాం. నిజానికి చేపమందు తీసుకోవడానికి మూడోసారి వస్తున్నవారు 10 శాతంకూడా లేరు. చేపమందు రెండుసార్లు తిన్నా నయం కాలేదనే అనుభవంతోనే రావడం లేదు. తమకున్నది ఆస్త్మా అనుకుని గుండెజబ్బులున్నవాళ్ళూ,ఇతర ఊపిరితిత్తుల జబ్బులున్నవాళ్ళు వస్తున్నారు. వాళ్ళకు జబ్బు నిర్ధారణ జరక్కుండానే చేప మింగించడం ఒక అశాస్త్రీయం, ప్రమాదకరమని మేము వ్యతిరేకిస్తున్నాం. మందులో ఏమేమి పదార్థాలున్నాయనేది వెల్లడి చేయకుండా వాడటం, ప్రయోగించడం చట్టవ్యతిరేకం అనే కోణంలో కూడా మేము వ్యతిరేకిస్తున్నాం. ఇన్ని అంశాలుండగా కేవలం ఉచితంగా ఇస్తున్నారనే కారణంతో ఇంతటి అశాస్త్రీయ విధానానికి ప్రభుత్వ సహకారంతో చేపమందు మేళా నిర్వహించడాన్ని వ్యతిరేకిస్తున్నాం.

ఈ చేపమందు చుట్టూ అల్లబడిన మార్మికతను రెండేళ్ళముందునుంచే జనవిజ్ఞానవేదిక సవాలు చేసింది. చేపమందు శాస్త్ర పరిశీలనకు ముందుకు రావాలని బత్తిని సోదరులకు అనేకసార్లు విజ్ఞప్తి చేశాం. ప్రభుత్వం కూడా స్పందించకపోయేటప్పటికి పియమ్ భార్గవ ఆధ్వర్యంలో వైద్యుల, శాస్త్రవేత్తల కమిటీని మేమే వేసి చేపమందులో స్టెరాయిడ్స్ ఉన్నాయని కనుగొన్నాం. ఆ స్టెరాయిడ్స్ ఎలా చేరాయో ఇప్పుడు పరిశీలిస్తున్నాం. జ.వి.వే. ప్రచారం ద్వారా రాష్ట్రమంతటా ఈ చేపమందుపై న్యాయంగా రావాల్సిన సందేహాలు వచ్చేటట్లు చేయగలిగాం. ఆ మందు కోసం ఆరేడు లక్షలమంది వస్తారని ప్రకటిస్తే కేవలం 50 వేల మంది మాత్రమే రావడం అంటే మేము చెబుతున్న అంశాలు ప్రజలు ఆలోచిస్తున్నారనే అర్థం. ఇది మేము సాధించిన ఒక మంచి ఫలితం. ఏడాదికేడాదికి తగ్గుతున్న ఆదరణను గమనించి, ప్రభుత్వం శాస్త్రీయ పరిశీలనకు ఆదేశిస్తుందని ఆశించాం. కానీ ఒక డాక్టరు ముఖ్యమంత్రిగా ఉన్న రాష్ట్రప్రభుత్వం ప్రజల ఆరోగ్యం కోసం సీరియస్‌గా నిలబడకపోవడం దారుణం. అరుదైన కొరమీను చేపలను సరఫరా చేయలేమన్న మత్స్యశాఖపై కొరడా ఝుళిపించడాన్ని జెవివి నిరసిస్తోంది.

ఆధునిక వైద్యం సామాజిక, సాంకేతిక వైఫల్యాల నుండే అశాస్త్రీయ వైద్యవిధానాలు పుడుతున్నాయి. ఆధునిక వైద్యం చాలా ఖరీదైనదైపోయి, సామాన్యప్రజలకు అందుబాటులో లేకపోవడంతో సులభమైన వైద్యాల పేరున కుహనా వైద్యాల బారిన పడేసినట్లవుతోంది.

కళ కంట కన్నీరు

మొలకలపల్లి కోటేశ్వరరావు

"బ్యూటీఫుల్... ఫెంటాస్టిక్... వండర్‌ఫుల్..." చూసినవాళ్ళు వాళ్ళకి తెల్సిన రకరకాల పదాలతో, రకరకాల భాషలలో విభ్రాంతితో, ఆశ్చర్యానందాలతో కామెంట్ చేస్తున్నారు. అన్ని దేశాల ప్రతినిధుల్ని ఆకర్షిస్తున్నదీ, ఆశ్చర్యంతో ముంచెత్తుతున్నదీ, అబ్బురపడేటట్లు చేస్తున్నదీ... ప్రధాన ద్వారం దగ్గరనుంచీ, జ్యోతి ప్రజ్వలన జరిగే వేదిక వరకూ అలంకరించిన బ్యానర్.

అది పట్టు వస్త్రం. 436 అడుగుల పొడవున, 4 అడుగుల వెడల్పుతో మధ్యలో ఎక్కడా దారపుపోగు చెదరకుండా, ఒక్క చిన్న అతుకు కూడా లేకుండా వెంట్రుకవాసి కంటే కూడా తక్కువ మందంతో ధగధగలాడుతోంది.

ఆ అపురూప... అపూర్వ... కళాత్మక వస్త్రాన్ని నేసిన నేతశిల్పి...

* * *

అది పెద్ద పల్లెటూరు. లేదా చిన్న పట్టణం. ఆ ఊరి పేరులో 'సిరి' వున్నది కానీ ఊళ్ళో ఎక్కడ చూసినా దరిద్రమే తాండవిస్తోంది.

ఇరుకిరుకు వీధులూ, మురుగు, పూరిగుడిసెలూ, చిన్న చిన్న పెంకుటిళ్ళూ, అక్కడే పందులూ, కుక్కలూ...

ఆ వూళ్ళో ఒక మురికి వాడలో చిన్న పెంకుటిల్లు.

ఆ ఇంటిలో ఒక వైపు నేతమగ్గం, మరోవైపు రెండు కుక్కి నులక మంచాలు, వాటి ప్రక్కనే వంట సామాగ్రి, అక్కడే ఒక పొయ్యి, ప్రక్కనే దండెం, దానిమీద వేసిన కొన్ని పాత బట్టలూ! కొత్త బట్టంటూ ఏదన్నా ఉంటే అది మగ్గంమీదే.

పొయ్యి నించి వచ్చిన పొగకి ఇల్లంతా మసిబారి పోయి వుంది.

మట్టినేల...దుమ్ము...బూజు... మసి... ఇరుకు... గాలీ, వెలుతురూలేని చీకటి వాతావరణం.

"ఎంపీగార్ని కలవాలి. నా దగ్గిర యాభై వున్నయ్యి. ఇంకో యాభై కావాలి. ఎట్టా?" స్నానం చేసి, ఎదురుగా గోడకి వేలాడ కట్టిన దేవుడి పటానికి దణ్ణం పెట్టుకుని, రోజూ చేసే పూజలాంటి కార్యక్రమాన్ని ముగించి, నుదిట బొట్టు పెట్టుకుని, బట్టలు వేసుకుంటూ అన్నాడు పరంధాములు భార్యతో.

ఆయనకి 60 ఏళ్ళుపై చిలుకు వున్నాయి. పీలగా, సన్నగా, అస్తిపంజరంలా వున్నాడు. అయితే మనిషి చాలా చురుకుగా వున్నాడు.

ఇంటికి దగ్గరగా వున్న బోరింగ్ పంపుదగ్గర బట్టలు ఉతుక్కుని వచ్చిన భార్య, తాడుమీద ఆరవేస్తూ, భర్త మాటకి ఒక నిముషం వరకూ జవాబు చెప్పలేదు. తరువాత నెమ్మదిగా అంది.

"నా దగ్గిర ఎక్కడ వున్నయ్యయ్యా! బీడీలు చుడితే వచ్చిన పైసలతో అంగడికిపోయి బియ్యం, ఇంటి సరుకులూ తెచ్చా. ఏపూట కాపూట ఎసుట్లోకి ఎతుకులాడుకోవాల్సిన బతుకేనాయె! రెక్కాడితేనే డొక్కాడే. లేకుంటే డొక్కెండిపోయె! అయినా ఆ ఎంపీసారుని ఇప్పటికి ఎన్నిసార్లు కలిసావూ, ఇంకెన్ని సార్లు కలవాలె? పనిచేస్తననో, చేయననో ఒకమాట తేల్చి చెపితే పోయె! ఎన్నిసార్లు తిప్పిచ్చుకుంటాడు ఇట్ల?"

"ఆయన ఎంపీసారు. లక్షపన్లు వుంటాయ్. చేస్తనని మాటిచ్చుండుగదా. అవసరం మన్ది. ఎన్నిసార్లు తిప్పిచ్చుకున్నా పని అయ్యేవరకూ తిరగాలె!" అన్నాడు పరంధాములు బాధగా.

ఇంత ఖర్చుపెట్టుకుని వెళ్తే ఎంపీ దొరుకుతాడో, దొరకడో, దొరికినా పనిచేసి పెడతాడో చేయడో, మళ్ళీ వాయిదా ఏమైనా వేస్తాడో అనే భయం మనసులో పీకుతోంది.

మొదట్లో తను చేస్తున్న పనులకి తనని ఎంతో ప్రోత్సహించింది. ఎంతో గౌరవించింది. ఎంతగానో సహకరించింది.

కానీ చివరికి ఆమెకీ, ఆమెతోపాటు తనకీ విసుగొచ్చింది.

ఎంతకాలం ఇలా కడుపు మాడ్చుకుని, పస్తులు పడుకునీ, నికృష్ట దరిద్రం అనుభవిస్తూ... ఏం సాధించాడు తను?

"నీలో ఎంత పనితనమున్నా ఏం లాభమయ్యా? కూటికీ, గుడ్డకీ కొరగాని పనితనం ఎందుకు? ముందు మన పొట్ట నిండాలె! లోకంలో నాలుగురాళ్ళు సంపాయిచ్చినోడే ఘనుడు. కళేకాదు. కాసు కూడా వుండాలె! కాసులు వుంటేనే కళ రాణించేది!" అనడం మొదలుపెట్టింది భార్య, కాలం గడిచేకొద్దీ.

ఆమె మాటలు సబబుగానే తోచాయి. తనకి కూడా చేస్తున్న పనిమీద ఆసక్తి క్రమేపీ తగ్గిపోవడం మొదలైంది.

ప్రధానమంత్రి దగ్గరనించీ పంచాయితీ బోర్డు ప్రెసిడెంటు వరకూ ఎంతో మంది నాయకుల్ని కలుసుకున్నాడు ఎన్నోసార్లు. ఏ నాయకుడ్ని కలుసుకున్నా

ఉత్త చేతుల్తో ఎప్పుడూ వెళ్ళలేదు.

ఇరవై ఏళ్ళ క్రిందటి ప్రధానమంత్రికి ఎంతో శ్రమపడి, రెండు నెలల సమయం వెచ్చించి, స్వంత డబ్బుతో మేలైన నూలు కొనుగోలు చేసి, ఎంతో కళాత్మకంగా నేసి పైజామా, నెహ్రూకోట్ ఆయనకి బహుకరించాడు.

ఓ వారం రోజులకి గవర్నమెంట్ నించి వచ్చిన ఆదేశంతో తనకి బ్యాంక్ వాళ్ళు పదివేల రూపాయల రుణం మంజూరు చేశారు. ఆ డబ్బుతో ఎక్కువ వడ్డీకి తెచ్చిన పాత అప్పులు తీరిపోయాయి. మిగిలిన డబ్బు ఇంటి అవసరాలకి రెండుమూడు నెలల్లోనే ఖర్చయ్యాయి.

నేత కళమీద వున్న ఆసక్తితోనే ఆకలీ, అర్ధాకలితో తనూ, తనతో పాటు కుటుంబం కూడా తల్లడిల్లిపోతూనే ఎన్నో ప్రయోగాలు చేసాడు. ఎన్నెన్నో కొత్త వస్త్రాలకి రూపకల్పన చేశాడు.

గతంలో ఎవరో అగ్గిపెట్టెలో పట్టే చీరని నేశారని విని ఆ ప్రేరణతోనే తను కూడా ఎంతో శ్రమించి అగ్గిపెట్టెలో ఇమిడే చీరని నేసి అద్భుతం సృష్టించాడు.

జిల్లా కలెక్టర్ దగ్గరికి తీసుకుపోయి తన ప్రతిభని ప్రదర్శించాడు.

కలెక్టర్ అబ్బురపోయాడు. తనని ప్రశంసించాడు.

"చాలా బావుంది. మంచి పనివాడివి, గొప్పకళాకారుడివి! సందేహంలేదుకానీ, ఈ చీర ఎవరైనా కట్టుకుంటే ఎలా వుంటుంది? ఎవరైనా కట్టుకోగలరా? ఎంత అసహ్యంగా వుంటుంది! ధరించడానికి వీలుగా వుండే చీరని నేయడానికి ప్రయత్నించు" అని సలహా ఇచ్చాడు కలెక్టర్.

ఆయన మాటల్ని స్ఫూర్తిగానూ, సవాల్‌గానూ తీసుకున్నాడు.

అగ్గిపెట్టెలో పట్టే చీర... పేరుకి కాదు... ఫ్యాషన్‌కి కాదు... ధరించడానికి వీలుగా...

నిద్రాహారాలు మరిచాడు.

తిరిగి 50 రోజులకి అదే కలెక్టర్ దగ్గరికి ఆయన నివాస బంగ్లాకి వెళ్ళి, ఆయన సమక్షంలో ఆయన భార్యకి బహుకరించాడు.

కలెక్టరూ, ఆయన భార్య... ఇద్దరూ మురిసిపోయారు. తను వద్దు వద్దని ఎంత గట్టిగా తిరస్కరించినా, రెండువేల రూపాయలు తనకి ఇచ్చారు.

"కళని అమ్ముకోవడం నాకు ఇష్టం వుండదు సార్. డబ్బు సంపాదించదలుచుకుంటే నా పనితనాన్ని ఉపయోగించి ఎంతో సంపాదించి వుండే వాడ్నిసార్. చేనేత రంగంలో నాకు వున్న విద్య నాతోనే అంతరించిపోకూడదుసార్. ముందు తరాల వాళ్ళకి వుపయోగపడేలా ప్రయోగశాలని నెలకొల్పాలని నా ఆశ సార్. అందుకు కొంత భూమి, రెండు లక్షల రూపాయల రుణం ప్రభుత్వపరంగా ఇప్పించండి సార్!" అని తను కలెక్టర్‌ని అభ్యర్థించాడు.

"తప్పకుండా. వారం రోజుల తరువాత కనపడు" అని కలెక్టర్ అభయం ఇచ్చాడు. తన కోరిక నెరవేరినట్లే భావించాడు. వారం రోజుల తరువాత ఆనందంగా కలెక్టర్ దగ్గరికి వెళ్ళాడు.

"సారీ పరంధాములుగారూ... మీకు వ్యక్తిగతంగా సాయం చేయగలను. కానీ మీరు కోరింది జరగాలంటే మంత్రుల స్థాయిలో ప్రయత్నాలు చేయండి" అన్నాడు కలెక్టర్.

ఆయన నిస్సహాయత వ్యక్తం చేయడంతో తరువాత తను ఎంతోమంది నాయకుల్ని కలుసుకున్నాడు. ఎన్నో విజ్ఞప్తులూ, అభ్యర్థనలూ చేసాడు.

ఈ ఎంపీ దగ్గరికి మూడు నెలలుగా తిరుగుతున్నాడు. కనీసం 25 సార్లు కలిసాడు. చేద్దాం, చూద్దాం అని అయిపోయినట్లే అనడం తప్ప తన విషయాన్ని పెద్దగా పట్టించుకోలేదు.

ఇవ్వాళే చివరిసారి.

ఇప్పుడు కానీ పనిజరగకపోతే తను ఏర్పాటు చేయదలచుకున్న 'ప్రయోగశాల' లేదా 'కళాశాల' లేదా 'అభ్యసనశాల' ఆలోచనకి స్వస్తి చెప్పడమేకాదు. ఈ వృత్తికే తను స్వస్తి చెప్పాలి.

కొద్ది మందికి అయినా తన కళని నేర్పుదామని తన ఆశ, ఆశయం! ఎందుకీ ఆశ! తనే ఈ బతుకు బతకలేకపోతున్నాడు. కొత్తవాళ్ళు ఎవరైనా నేర్చుకున్నా ఏం బావుకుంటారు?

"ఇవిగోనయ్యా నలభై రూపాయలు ఉన్నయ్యి. పిల్లలు దాచిపెట్టుకున్న డబ్బులు ఇయ్యి. ఇట్ట ఎంతకాలం తిరగాలో, ఏం పాడో!" డబ్బు భర్త చేతికి అందిస్తూ అంది ఆమె.

ఇక తిరిగే పనిలేదు. తాడోపేడో ఇవ్వాళే. పని అయితే కావటం. లేకపోతే మానుకోవటం!" స్పష్టంగా తేల్చిచెప్పాడు పరంధాములు.

ఇంట్లో వున్న కొద్ది చద్దన్నం తిని బస్టాండుకి వచ్చాడు పరంధాములు.

టౌన్‌కి వెళ్ళడానికి బస్ సిద్ధంగా వుంది. ఎక్కి కూర్చున్నాడు.

బస్‌లో కూర్చున్నా ఆలోచనలు...

తను ఎంతోమంది నాయకుల్ని కలుసుకున్నాడు. ఏం ఉపయోగం? ఎవరూ చిన్న వీసమెత్తు సాయపడలేదు.

అగ్గిపెట్టెలో పట్టే చీరే కాదు. వేలి వుంగరంలో దూరే చీరని కూడా తను నేసాడు. ఒకటికాదు, రెండుకాదు– 'కళాఖండాలు' అని ధీమాగా చెప్పుకోవడానికి ధీటుగా వుండే వస్త్రాలు ఎన్నో నేసాడు. తన ప్రయత్నాలకీ, ప్రయోగాలకీ నాయకులనించీ, ప్రభుత్వాధికారులనించీ గొప్పగా స్పందన లభించింది. కానీ ఆర్థిక స్పందన మాత్రం శూన్యమైపోయింది.

తనికి కావాల్సింది తన పనికీ, ప్రయోగాలకీ అవసరమైన కొంత డబ్బూ, కొంతస్థలమూ. పరంధాములు ఆలోచనల్లో కూరుకుపోయి వుండగానే రెండు గంటల ప్రమాణానంతరం బస్‌టౌన్‌కి చేరుకుంది.

బస్‌దిగి, ఆటో ఎక్కి ఎంపీ గారింటికి వెళ్ళాడు.

ఇంటి ముందూ, వరండాలోనూ చాలామంది జనం వున్నారు. పోలీసులు కూడా చాలామంది వున్నారు. ఐదారు కార్లు వున్నాయి.

"కర్రా విరగదూ పామూ చావదు! ఎవరికీ చేయను అని మాత్రం చెప్పడు. అందరికీ పని అయిపోయినట్లే చెపుతాడు. తన చుట్టూ తిప్పించుకోవడం ఈయనకి సరదా. తిరిగీ తిరిగీ వాళ్ళే విసుగుపుట్టి మానుకుంటారు తప్ప ఈ దేవుడు మాత్రం ఎవరికీ పని చేయడు" పరంధాములు ప్రక్కన కుర్చీల్లో కూర్చున్న ఇద్దరు కుర్రవాళ్ళు నవ్వుతూ మాట్లాడుకుంటున్నారు. ఆ మాటలు వినడంతోనే పరంధాములకి బీపీ, భీతి కొంచెం పెరిగాయి.

అంటే ... తన పని కానట్లేనా?

అందరితో పాటే పరంధాములు చాలాసేపు కుర్చున్నాడు. కూర్చునీ కూర్చునీ కాళ్ళు తిమ్మిరెక్కిపోతున్నాయి.

పొద్దున తిని వచ్చిన తిండి కడుపులో ఆకలి నకనకలాడిపోతోంది. ఎదురుచూడగా... చూడగా... చివరికి బయటికి వచ్చాడు ఎంపీ. అందరూ లేచి నిలబడ్డారు. అక్కడ వున్న వాళ్ళనీ ఒక్కొక్కర్నీ పలకరించుకుంటూ పరంధాములు దగ్గరికి వచ్చాడు ఎంపీ.

"ఏం పరంధాములూ... బాగున్నావా? ఎంతసేపవుతోంది వచ్చి?"

"చాలా సేపవుతోంది సార్"

"అరె, అలాగా! నీ విషయం హ్యాండ్‌లూమ్ కమీషనర్‌తో మాట్లాడాను పరంధాములూ. పని అవుతుందన్నాడు. తెల్సుగా, గవర్నమెంట్‌తో కూడిన వ్యవహారం. త్వరగా పని తెములర్చు. జాగు చేస్తారు. రేపు మినిష్టర్‌తో మాట్లాడి నీ విషయం ఫైనల్ చేస్తాను. వారం పది రోజులు ఆగిరా" అంటూనే మరో మనిషి దగ్గరికి వెళ్ళిపోయాడు ఎంపీ.

అతనికి అసలు మాట్లాడే అవకాశమే ఇవ్వలేదు. కల్సిన ప్రతిసారీ ఇవే మాటలు. మనసులో కోపం రగిలిపోతుండగా బయటికి వచ్చాడు పరంధాములు

ఎదురుగా వున్న ఆటో ఎక్కి బస్టాండ్‌కి చేరుకున్నాడు. బస్ సిద్ధంగా వుంది.

"ఏమైందయ్యా నువ్వు పోయిన పని? ఏమన్నాడు?" వాకిట్లో కూర్చుని బీడీలు చుడుతున్న భార్య ఆశగా అడిగింది, పరంధాములు లోపలికి అడుగుపెడుతుండగానే.

"పని అయిపోయినట్లే అన్నాడు" అంటూనే పరంధాములు మగ్గం దగ్గరికి వెళ్ళి పటపటా తనకి వీలైన వాటిని విరవడం మొదలుపెట్టాడు.

వాకిట్లో కూర్చున్న భార్య, ఆయన చేస్తున్న పనిని చూసి పరిగెత్తుకుని వచ్చి "ఏందయ్యా నువ్వు చేసే పని?" అంది కోపంగా

పరంధాములు ఉగ్ర నరసింహావతారంలో వున్నాడు.

"నాకు అద్దులే. ఎందుకు ఈ దరిద్రం? ఈ మగ్గం, అసలు ఈ సామాను ఏమీ ఈ ఇంట్లో వుంటానికి వీల్లేదు. కూడుగుడ్డా పెట్టనివి ఎందుకే ఇవి? వద్దు. అసలు ఇక ఈ పని ముట్టుకోను" అంటూ భార్యని వెనక్కి నెట్టి, దారాలు తెంపుతూ, బలమంతా వుపయోగించి కొన్ని సామాన్లు విరగ్గొట్టాడు.

చాలా సేపటికి శాంతించి "పోనీయ్... పీడా పోయింది" అంటూ బీడీలు చుట్టడానికి భార్య చేతిలోని చేటని అందుకున్నాడు. ✪

పిల్లల్ని కొట్టొచ్చా!

ముదిగంటి సుజాతారెడ్డి

లిని ముఖం గంభీరంగా వుంది "ఏమైంది మాలినీ! ఆదిత్యను స్కూలుకు పంపించావా!'' అడిగాన్నేను ఆదుర్దాగా.

"ఆదిత్య బాగానే వున్నాడు ఆంటీ! స్కూలు బస్సు ఎక్కించి ఇటు వచ్చాను..." అని నా ముఖంలోకి చూసింది మాలిని.

"ఏమైంది మాలినీ! ఏదోలా వున్నావు. నీ ఆరోగ్యం?..." ముగించకుండానే అగాన్నేను.

''నేను బాగానే వున్నాను ఆంటీ! ఆదిత్యనే..." మాలిని కళ్ళు నేలకు దించుకుంది.

"ఏమైంది మాలినీ! చెప్పు! ఆదిత్యకేమైంది? బాగా చదవటం లేదా?..." అడిగాన్నేను. మాలిని కళ్ళలోంచి జరజర కన్నీళ్ళు కారుతున్నాయి. తడిసిన కనురెప్పలెత్తి నా వైపు చూసింది మాలిని.

"ఏమైందో చెప్పు. మాలినీ!" అన్నాన్నేను. నా గొంతు అసహనంతో కొంచెం కఠినంగానే ధ్వనించింది.

"నేను ఆదిత్యను కొట్టాను ఆంటీ! పాపం! బాగా ఏడ్చాడు."

"కొట్టావా? ఎందుకు కొట్టావ్ మాలినీ!"

"ఆడుతూ ఫ్లవర్‌వాజ్‌ను కింద పడేసాడు. అది ముక్కలు ముక్కలైంది. మంచి ఫ్లవర్‌వాజ్. అందమైన ఫ్లవర్‌వాజ్ విరిగిపోయిందే అనే కోపంతో కొట్టాను ఆంటీ!"

"ఫ్లవర్‌వాజ్‌ను విరగ్గొట్టేసాడని కొట్టావా! ఆ విధంగా పొరపాటున మన చేయితగిలో, కొంగు తగిలో గాజుపాత్రలు కింద పడిపోవటం పగలటం జరగొచ్చుకద. అంతమాత్రానికే పిల్లవాన్ని కొట్టటమెందుకు మాలినీ! కోప్పడితే సరిపోయేది. లేదా ఆ ఫ్లవర్‌వాజ్ అంటే నీకెంత ఇష్టమో అది ఎంత విలువైందో అది పగిలిపోవటంతో నీకెంత బాధ కలిగిందో వాడికి తెలిసేట్లుగా చెప్తే సరిపోయేది కద!" అన్నాన్నేను.

''వాణ్ణి కొట్టినందుకే కద నేను బాధపడ్తున్నాను ఆంటీ!" అంది మాలిని.

"సరే! కొట్టింతర్వాత నువ్వు కొట్టినందుకు బాధపడ్తున్నావు. కొందరైతే అది కూడా చేయరు. పిల్లల్ని కొట్టటం తమ జన్మహక్కు అనుకుంటారు కొందరు తల్లిదండ్రులు".

"పిల్లల్ని కొట్టటం నాక్కూడా ఇష్టంలేదు ఆంటీ! కోపం చిరాకుతో కొట్టేసాను. పూర్వ కాలం పదిమంది పిల్లల్ని ఎట్లా పెంచేవాళ్ళో... కాని మాకు ఒక్కడితోనే సహనం పోతున్నది." మాలిని అన్నది నిజమే. పూర్వకాలం గంపెడు పిల్లలతో ఎట్లా వేగేవాళ్ళో!

''కాని అప్పటి మాటవేరు మాలినీ! అప్పుడీ పెంపకాలు లేవు. అయినా అప్పుడూ పిల్లల్ని కొట్టేవాళ్ళు. కొట్ట టమేమిటి చితకబాదే వాళ్ళు. పంతుళ్ళు అయితే బడిలో చింతబరిగెలతో దేహశుద్ధి చేసే వాళ్ళు. కోదండం ఎక్కించే వాళ్ళు. గోడ కుర్చీలు కూర్చోపెట్టటం, ఎర్రటి ఎండలో నిలబెట్టటం వంటి ఘోరమైన శిక్షలు వేసేవాళ్ళు పంతుళ్ళు. తల్లిదండ్రులకు పిల్లల తిండి చదువుల గురించి ఇప్పుడున్నంత శ్రద్ధ అప్పుడెక్కడిది'' అన్నాన్నేను.

''ఆంటే! పిల్లల్ని కొట్టడంనాకూ ఇష్టంలేదు. కాని ఈ రోజు కోపంలో ఒళ్ళు తెలియక వాణ్ణి కొట్టేసాను''. మళ్ళీ జలజల కన్నీళ్ళు కార్చింది మాలిని.

"పిల్లల్ని చీటికిమాటికి కొట్టటం మంచిది కాదు నిజమే. నువ్వేదో ఆవేశంలో ఓ దెబ్బవేసావు. సాయంత్రం ఆదిత్య స్కూలు నుంచి వచ్చాక నువ్వెందుకు కొట్టావో కారణం చెప్పి సముదాయించు. సారీ కూడా చెప్పు!" నా మాటలు విని మాలిని కళ్ళు తుడుచుకుంటూ చిరునవ్వు నవ్వింది.

"మాలినీ! నీ మాదిరిగా పిల్లల్ని కొట్టటం తప్పని ఎందరు తెలుసుకుంటారు? పిల్లల్ని అయినదానికి, కాని దానికి శిక్షించటం అంత మంచిది కాదు. కొట్టటంతో వాళ్ళల్లో వున్న సృజనాత్మకత నశిస్తుందని చాలామంది తెలుసుకోరు. పిల్లలు విషయాల్ని అర్థం చేసుకునేట్లు చేయాలి. చిలిపి పనులు, చెడ్డపనులు చేస్తే కఠినంగా అట్లా చేయకూడదని అట్లా చేయటం తప్పని చెప్పాలి. అప్పటికీ వినకపోతే దండించాలి. అంటే కఠినమైన శిక్షనేదైన వేయాలి. అట్లాంటి పనులు చేస్తే వాళ్ళకిష్టమైన చాక్లెట్లు దొరకవనో, వాళ్ళకిష్టమైన టీవీ ప్రోగ్రామ్ చూడటానికి వీల్లేదనో, వాళ్ళకిష్టమైన సినిమాకు తీసుకపోమని చెప్పటం వంటి శిక్షలు వేయాలి. కాని దెబ్బలు కొట్టటం నా అభిప్రాయంలో అంత మంచిది కాదు మాలినీ!" అన్నాన్నేను.

"అవును ఆంటీ! మీరన్నది నిజమే. మాటిమాటికి కొడ్తే పిల్లలు బండబారి పోతారు. చెప్పిన మాటలు వినకుండా మొరాయిస్తారు. మనముందు ఏమీ ఎరుగనట్లుంటారు. కాని మనం ముఖం తిప్పగానే చిలిపి పనులు చేస్తారు. మొండి కేస్తారు. మావారి స్నేహితుని కొడుకు ఆదిత్య ఈడువాడే! క్లాసులో ఎవరిదో పెన్సిల్ తెచ్చాడు. ఆ పెన్సిల్‌ను వాడు దొంగిలించి తెచ్చాడనే నిర్ణయానికి వెంటనే వచ్చేసి వాణ్ణి చితకబాదింది. ఆ పెన్సిల్ ఎక్కడిది ఎందుకు తెచ్చాడని నెమ్మదిగా ఆమె వాన్ని అడుగవచ్చుకద! అడుగకుండానే ఇష్టం వచ్చినట్లుగా కొట్టింది. ఇంతకూ వాడువాని స్నేహితునితో పెన్సిల్ ఎక్స్‌చేంజ్ చేసుకొని తెచ్చుకున్నాడు. అదేది తెలుసుకోకుండానే ఆమె కొట్టేసింది. అది తెలిసినంకనయిన ఆమె పశ్చాత్తాప పడకపోవటం నాకు ఆశ్చర్యం కలిగించింది ఆంటీ!" అంది మాలిని.

"అదే మాలినీ! నేను చెప్తున్నది. అకారణంగా కోపావేశాలతో పిల్లల్ని చితకబాదడం అంతమంచిది కాదు. వాళ్ళ ఆలోచనా శక్తిని అది చంపేస్తుంది. వాళ్ళను మొండి వాళ్ళను చేస్తుంది!" అన్నాన్నేను.

''నేను మళ్ళీ ఆదిత్యను కొట్టాను ఆంటీ!" చిరునవ్వు నవ్వింది మాలిని.

మేకల మదన్‌మోహన్‌రావు

నక్క - మేక



అనగనగా ఒక అడవి. అందులో ఓ నక్క వుండేది. అది ఓసారి ఆహారానికి వెళ్లింది. పొరపాటున అది ఒక బావిలో పడింది. బయటికి రావడానికి చాలా ప్రయత్నించింది. కానీ బయట పడలేకపోయింది.

ఇంతలో అటుగా ఓ మేక వచ్చింది. దానికి బాగా దాహంగా వుంది. అందుకే ఆ బావిలోకి తొంగి చూసింది. దానికి నక్క కనిపించింది.

నక్క బావి లోపలికి దిగి నీళ్ల తాగుతుందనుకుంది మేక. "ఏమండీ నక్కగారూ! ఈ బావిలో మంచి నీళ్లున్నాయా?" అని అడిగింది.

ఈ మాటలు వినగానే నక్క చాలా సంతోషించింది. ఎలాగోలా ఆ మేక సాయంతోనే బయటపడాలనుకుంది. వెంటనే...

"మంచి నీళ్లా! ఇవి మధురమైన నీళ్లు. నా జన్మలో ఇంత తియ్యటి నీళ్లు తాగలేదు. కావాలంటే నువ్వు కూడా దిగి కాసిని మంచి నీళ్లు తాగు" అంది నక్క తెలివిగా.

పాపం దాహంతో వున్న మేక ఇంకేం ఆలోచించకుండా గబాలున బావిలోకి దూకేసింది. కడుపు నిండా నీళ్లు తాగింది. కానీ ఆ తర్వాత బయటకు రాలేకపోయింది. అది కూడా నక్కలాగే బావిలో బంధీ అయిపోయింది.

* * *

జిత్తులమారి నక్క ఓ ఉపాయం ఆలోచించి "ఎలా బయట పడాలో నాకు తెలుసు" అంది.

"చెప్పండి" అంది మేక.

"నన్ను నీ వీపు మీద ఎక్కించుకో. అక్కడి నుండి నీ కొమ్ముల మీదకు ఎక్కి ... ఆ తరువాత బయటికి సులభంగా పోగలను" అంది.

"మరి నా సంగతి?" అడిగింది మేక అమాయకంగా.

"ముందు నేను బయటపడితే నిన్ను ఎలాగోలా బయటికి తీస్తా" అంది నక్క.

"సరే" అని నక్కను తన మీదకి ఎక్కించుకుని బయటపడడానికి సహకరించింది మేక.

అలా నక్క బయటపడింది.

"నా సంగతేంటి? నా సంగతేంటి?" అంటూ అరవసాగింది మేక.

అందుకు నక్క నవ్వి "నీకు అంత తెలివి వుంటే నువ్వు అసలు ఇందులో ఇరుక్కునే దానివే కాదు. బయటపడే మార్గం తెలియనప్పుడు బావిలోకి ఎందుకు దూకావు?" అంటూ మేకను వదిలి వెళ్లిపోయింది నక్క.



వీరి వీరి గుమ్మడిపండు...

వీరి పేరేమి?

హలో! ఈ వారం వీరి వీరి గుమ్మడి పండులో వచ్చినవారెవరో గుర్తుపట్టేశారా! ఈయన మన దేశ ప్రధానిగా చేశారు. ఏంటి? వెంటనే జవాబు రాసి పంపుతారా! మీరు రాసిన సమాధానం సరైనదైతే మీ పేరు, తరగతి, ఊరు ప్రచురిస్తాం. ఓకేనా. ఈ పని ఇవాళే ఇప్పుడే చెయ్యాలని తెలుసుకదా. మా చిరునామా: **వీరి వీరి గుమ్మడిపండు**, బాలనేస్తాలు, ప్రజాశక్తి, స్ట్రీట్ నెం.1, అశోక్‌నగర్, హైదరాబాద్.

22.5.05 కు సరైన సమాధానం రాసినవారు

జి.సాయిభరత్‌రెడ్డి, 6వ తరగతి, మోదుకూరు, గుంటూరు. పెరుమళ్ల రాకేష్, వెలగచెట్టు సంగం, నెల్లూరు. పెన్మెత్స శ్రావ్య, ఆదిత్య పబ్లిక్ స్కూల్, అడ్డవంతెన దగ్గర, భీమవరం, పశ్చిమగోదావరి. ఎన్.సుజన్, బ్రాడీపేట, గుంటూరు. ఎం.అలేఖ్య, 5వ తరగతి, ప్రతిభ పబ్లిక్ స్కూల్, లింగాల, కల్లూరు, ఖమ్మం. కాండ్రు సుందరయ్య, కాండ్రు లెనిన్ బాబు, పత్తిపాటి సంజీవ్‌కుమార్, ఎల్ఇ స్కూల్, ఆత్మకూరు, గుంటూరు.

29.5.05 సమాధానం
జవహర్‌లాల్ నెహ్రూ

చుక్కల్లో చిక్కిన వారెవరమ్మా!



హాయ్ చిట్టి పొట్టి నేస్తాలూ! ఈ బొమ్మలో ఓ బుడ్డోడు కనిపిస్తున్నాడే. వాడి పేరు డుంబు. వాడు ఒక పక్షిని పెంచుకుంటున్నాడు. దాన్ని పంజరంలో పెట్టాడు. చూశారుగా. ఇంతకీ ఆ పక్షి ఏంటో మీకు తెలియాలంటే... వెంటనే చుక్కలు కలిపెయ్యండి. అప్పుడు చుక్కల్లో చిక్కినవారెవరో చిటికెలో తెలిసిపోతుంది. ఏమంటారు? ఓకే అంటారని మాకు తెలుసులే.



వేరుగా వున్నదెవరో...

పక్క బొమ్మలో నాలుగు కొంగలు వున్నాయికదా. వాటి పేర్లు చెప్తే మీరు తెగ ఆశ్చర్యపోతారు. చెప్పేస్తున్నాం. ఎ, బి, సి, డి. ఏంటి ఇంగ్లీషు అక్షరాలు వాటి పేర్లా!' అని కొందరు నేస్తాలు పైకే అనేస్తున్నారు. అన్నట్టు అవి ఆకాశంలో ఎంతో వయ్యారంగా ఎగురుతున్నాయి కదూ. సరే. అసలు సంగతి కొద్దాం. ఆ ఎబిసిడిల్లో ఒక కొంగ కాస్త తేడాగా వుంది. అంటే తతిమ్మా మూటిల్లో అది కలవడంలేదన్నమాట. మరి ఆ కొంగ ఏదో కనుక్కొని చెప్పాల్సిన బాధ్యత మీదే. నాలుగు కొంగలను బాగా పరిశీలనగా చూస్తే సరి. జవాబు ఇట్టే తెలుస్తుంది. అప్పటికీ తెలీకపోతే మా సమాధానం చూడండే.

జవాబు: సి



చిన్నారి చిత్రకారులు

ఎస్. సుబ్రమణ్యం,
8వ తరగతి,
గుడ్ సిటిజన్స్
హైస్కూల్, ఎల్‌బినగర్,
రంగారెడ్డి.

కట్ట రంజిత్‌కుమార్, 9వ తరగతి, చిట్యాల, నల్లగొండ.



యు.ఉరుకుందు,
7వ తరగతి,
యంపియుపిస్కూల్,
కల్లుకుంట,
పెద్దకడబూరు,
కర్నూలు.



రంగులు పూద్దాం



అదిగో బొమ్మలో కనిపిస్తున్నాయే వాటి పర్లేంటో చెప్పకోండి చూద్దాం. య్యాన్. మీరు చెప్పింది కరెక్టే. అవి పెంగ్విన్ పక్షులు. తల్లి పెంగ్విన్ పిల్లకు ఎంతో ప్రేమగా ఆహారం తినిపిస్తోందికదూ. ఈ బొమ్మకుగాని రంగులు వేస్తే.... అదురుద్ది కదూ.

బుజ్జి నేస్తాన్ని చేరేదెలా

బొమ్మలో కనిపిస్తున్న రెండు చీమలు మంచి నేస్తాలు. పాపం వాటికి కలిసి ఆడుకోవాలని ఆశ. కానీ దారి తెలీడంలేదు. మీరు కనిపెట్టి వాటికి సాయం చెయ్యండి చూద్దాం.



ఆ టీచర్ దాన... వీరా...

పొత్తూరి రాజేంద్రప్రసాద్‌వర్మ

తూరుపు తెల్లవారలేదు.

వర్షం వెలసిన తర్వాత వచ్చే మట్టివాసన ముక్కు పుటాలకు తగిలి అదోలాంటి తన్మయత్వాన్ని కలిగిస్తోంది. వాతావరణం చల్లబడి గాలి కెరటాలు శరీరంతో పరాచికాలాడుతూ పలకరిస్తున్నాయి.

గాలిలో ఆవరించిన తేమ చలిలా కమ్ముకుంటోంది.

పంచానన్ పడూయ్ నులకమంచంపై కదిలాడు.

తలకింద పెట్టుకున్న సన్నని తువ్వాలు లాంటి దుప్పటిని తీసి కప్పకుని ముణగదీసుకున్నాడు.

దూరంగా రైలు చప్పుడు పాసినేటింగ్‌గా వినిపిస్తోంది. హౌరా వెళ్లే ఆ రైలు శబ్దం వింటూ పంచానన్ నిద్రలేస్తుంటాడు.

అప్పటికి వెలుగురేఖలు విచ్చుకోవు.

అయినప్పటికీ నీరవ నిశ్శబ్దంలో సన్నని శబ్దంతో మొదలై గుండెలపై నుంచి కదిలిపోతూ వెళ్లే ఆ రైలు శబ్దం అతని మత్తును వదిలిస్తుంది. పక్కమీద నుంచి లేవకుండా తేలిపోతూ వచ్చే చుక్‌చుక్ రైలు శబ్దం అదోలాంటి ఆనందాన్ని కలిగిస్తుంది. కొన్నేళ్లుగా అలవాటైన ఆ రైలు అప్పుడప్పుడు ఆ సమయంలో కూత పెడుతుంది. అలా కూత పెట్టినప్పుడు పంచానన్ పడూయ్ ఉలిక్కిపడి లేస్తుంటాడు.

వారం పదిరోజులుగా ఎండవేడిమి తీవ్రంగా ఉంది.

రాత్రి కురిసిన వర్షంతో భూమి కాస్త చల్లబడింది.

పడూయ్ పడుకునే మంచం పక్కన ఎప్పుడూ విసనకర్ర, సిల్వరు చెంబు ఉంటుంది. కిటికీ

తలుపులు తీసినప్పుడు కూడా గాలిలేకపోతే తనకి తనే విసురుకుంటాడు. నిద్ర పట్టకపోతే సిల్వరు చెంబులో మంచినీళ్లు తాగి పక్కకు వాలి పడుకుంటారు.

ఇరవై ముప్పయి సంవత్సరాలుగా యాంత్రిక జీవనం.

హౌరా ఎక్స్‌ప్రెస్ రైలు వెళ్లిన తర్వాత చల్లబడ్డ వాతావరణంలో మరి కాసేపు నిద్రపోవాలని శరీరం కోరుకుంది. కాని పడోయ్ మనసు మాత్రం కర్తవ్యాన్ని గుర్తుకు తెచ్చింది.

అలవాటు తప్పని దినచర్య మొదలైంది.

చీకట్లో తడుముకుని కర్ర తలుపు తెరిచాడు.

దూరంగా బాల్ బెనర్జీ టీ కొట్టు కన్పించింది.

ఎప్పుడూ అతనే తనకన్నా ముందు నిద్రలేస్తాడు.

దూరంగా వీధిలైటు కాంతిలో వర్షపు తుంపర్లు అస్పష్టంగా కనిపిస్తున్నాయి. మేఘాలు వెలిపోగా వెలిసిపోయిన వర్షపు గుర్తులు కనిపిస్తున్నాయి.

ఇంటి ఆవరణలో ఉన్న నుయ్యి దగ్గరికి వెళ్లి బాల్చీతో నీళ్లు తోడుకుని పళ్లు తోముకున్నాడు. ఇంటి పక్క రోడ్డువార వీధిలైటు ద్వారా ప్రసరిస్తున్న దీపపు కాంతి నూతి పళ్లెంపై పరావర్తనం చెందుతోంది.

మట్టివాసన ముక్కుపుటాలను తాకుతోంది.

లోపలికి వెళ్లి లాల్చీ వేసుకుని బెనర్జీ దుకాణం వైపు అడుగులు వేశాడు పంచానన్.

పంచానన్‌ను చూడగానే బెనర్జీ చిన్నగా నవ్వాడు.

తర్వాత పొగలు కక్కుతున్న 'టీ' గ్లాసు అందించాడు బెనర్జీ.

పక్కనున్న కర్రబల్లపై కూర్చుని సంతృప్తిగా టీ తాగి ఇంటివైపు కదిలాడు.

వెలుగురేఖలు విచ్చుకుంటున్నాయి.

* * *

పశ్చిమ బెంగాల్, హౌరాలో డోమ్‌జడ్ ప్రాంతంలో బిగ్గ్ హైస్కూలు.

పురాతనమైన కట్టడం.

సుమారు వెయ్యిమంది పిల్లలు చదువుతున్నారు.

ఆరోజు పాఠశాల అంతా సందడిగా ఉంది.

2000 సంవత్సరం సెప్టెంబర్ 15.

బిగ్గ్ హైస్కూలును అందంగా అలంకరించారు.

పాఠశాల ఆటస్థలంలో వేదిక ఏర్పాటు చేశారు.

ఆ హైస్కూలులో హిందీ పండితునిగా పనిచేసి పదవీ విరమణ చేసిన పంచానన్ పడూయ్‌కి సన్మాన కార్యక్రమం.

పంచానన్ 28 సంవత్సరాలు అదే హైస్కూలులో పనిచేసి పదవీ విరమణ చేసిన తర్వాత మూడేళ్ళ తర్వాత పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం ఉత్తమ ఉపాధ్యాయునిగా గుర్తించి బహుమతి ప్రధానం చేశారు. ఆ సందర్భంగా అదే పాఠశాలలో పనిచేసినందుకు పాఠశాల సిబ్బంది సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

సాయంత్రం ఆరుగంటలకు కార్యక్రమం మొదలైంది.

1997లో పదవీ విరమణ చేసిన తర్వాత ఒంటరిగా శేషజీవితాన్ని గడుపుతున్న పంచానన్ పడోయ్‌ని ప్రభుత్వం గుర్తించింది. ఉపాధ్యాయ దినోత్సవం నాడు కోల్‌కత్తాలో ప్రభుత్వపరంగా సన్మానం జరిగింది.

గోల్డుమెడల్‌ని బహూకరించారు.

ఆ సన్మానాన్ని పురస్కరించుకుని అది జరిగిన పదిరోజుల తర్వాత సెప్టెంబర్ 15న అతను పని చేసిన బిగ్గే హైస్కూలులో సిబ్బంది విద్యార్థులు ఈ సన్మానాన్ని ఏర్పాటు చేసింది.

అంతమందిని చూసేసరికి పంచానన్ మనసు పులకరించి పోయింది. ఎన్నో సంవత్సరాల అనుబంధం గుర్తుకు వచ్చింది. మొదట సన్మాన కార్యక్రమానికి వెళ్లకూడదని అనుకున్నాడు. కానీ అందరినీ చూడవచ్చునని బయలుదేరాడు.

కార్యక్రమం ప్రార్థనతో మొదలైంది.

అనేకమంది పంచానన్ నిరాడంబరతను కొనియాడారు. అంతవరకూ అతను విద్యార్థుల కోసం చూపించిన ధాతృత్వాన్ని మెచ్చుకున్నారు. కొంతమంది విద్యార్థులు కూడా తమకు హిందీ పాఠాలు నేర్పిన పంచానన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

తర్వాత సన్మాన కార్యక్రమం మొదలైంది.

శాలువా కప్పి దండలు వేసిన తర్వాత విద్యార్థులు, ఉపాధ్యాయులు అందరూ కలిసి పంచానన్‌కు పర్సు బహూకరించారు. "పదవీ వరమణ చేసి ఏ ఆధారం లేకుండా ఒంటరిగా జీవిస్తున్న పంచానన్ టీచర్‌ను ఆదుకోవాలని ఇస్తున్న చిన్న కానుక స్వీకరించాలని" ప్రధానోపాధ్యాయుడు మిశ్రా ఆ పర్సును అందజేశారు.

చివరలో పంచానన్ తనకు జరిగిన సన్మానానికి కృతజ్ఞతలు చెప్పడానికి నిల్చున్నాడు. ఆయన ఏమిచెబుతాడా అని అందరూ చెవులు రిక్కించారు. ముందుగా తనకు జరిగిన సన్మానానికి

కృతజ్ఞతలు చెప్పాడు. విద్యార్థులు పెద్దలతో ఎలా మసలుకోవాలో వివరించాడు. అనేక సూక్తులు, ఉదాహరణలతో పంచానన్ ఉపన్యాసం కొనసాగింది. చివరలో "చదువుకోవాలన్న ఆసక్తి ఉండి చదువుకోలేక పోతున్న పిల్లలంటే నాకెంతో ఆసక్తి. వారికోసం ఇప్పటివరకూ నేను చేస్తున్న కృషి సరిపోదు. మరెంతో మందికి సహాయపడాలంటే నాలో దాతృత్వం మరింత పెరగాలి. ఇతరులకు సహాయం చేయాలనే తపన నాలో ఇంకా పెంపొందాలి. ఒకే ఒక్కడిగా సింపుల్‌గా జీవిస్తున్న నాకు ఏమీ అవసరం లేదు. మీరు అందజేసిన పర్సులో సొమ్ము ఈ పాఠశాలకే తిరిగి ఇస్తున్నాను. దీంతో పాటు ప్రభుత్వం నాకు ఇచ్చిన బంగారుపతకం కూడా ఇస్తున్నాను. దీనిని పేద విద్యార్థుల కోసం ఉపయోగించాలి. అలా చేసినప్పుడే నాకు మీరందరూ చేసిన సన్మానానికి నిజమైన సార్థకత కలుగుతుంది".

పంచానన్ బాబు నిర్ణయం అక్కడివారికి ఆశ్చర్యం కలిగించలేదు. సన్మానసభలో అటువంటి ప్రకటన ఏదో ఆయన చేస్తాడని అందరూ ఊహించారు. వారి ఊహ అతని ప్రకటనతో నిజం అయినట్లయింది.

బంగారు మెడలు, పర్సు తిరిగి ప్రధానోపాధ్యాయునికి పంచానన్ అందజేశాడు. సిబ్బంది, విద్యార్థులు చప్పట్లతో ఆ ప్రాంతాన్ని మారు మోగించారు.

పంచానన్ సంతృప్తిగా సన్మాన వేదిక దిగాడు.

* * *

పంచానన్ పదూయ్ పేదరికంలో పుట్టాడు. దారిద్ర్యం అతని జీవితాన్ని అడుగడుగునా కుంగదీసింది.

బెంగాల్‌లో రెండవ తరగతి చదువుతున్నప్పుడు తండ్రి చనిపోయారు. కుటుంబమంతా ఎకరం పొలంపైన ఆధారపడేది. వర్షాధారం అయిన పొలం కరువు కోరల్లో చిక్కుకుని బీటలు వారిపోయింది. పొలం ఉన్నప్పటికీ ఎందుకూ పనికి రాకుండా తయారైపోయింది.

పూట గడవడానికే కష్టంగా ఉన్న పరిస్థితుల్లో తల్లి నగలు, ఇంటిలో వంటపాత్రలు కూడా తాకట్టు పెట్టవలసి వచ్చింది. మట్టి కుండలో చాలీచాలని బియ్యాన్ని తల్లి వండిపెడితే సగం నిండిన కడుపుతో చదువు సాగించాడు. ఆ సమయంలో తనవంటి ఎంతోమంది పేదపిల్లలు కళ్లముందు మెదిలారు.

"చదువుకోవడానికి ఎవరికీ ఆర్థిక ఇబ్బందులు రాకూడదు. సహాయం చేసేవారు లేక చదువు మధ్యలో ఆగిపోకూడదు. ఉద్యోగం లభిస్తే వచ్చే ఆదాయాన్ని అధికశాతం ఇబ్బందులతో చదువుకోలేకపోతున్న వారి కోసం వినియోగించాలి!" అని పంచానన్ మనసులో గట్టిగా నిర్ణయించుకున్నాడు. తన ఆశయం సఫలీకృతం కావాలంటే భార్యాపిల్లలు, ఇతర బాదరబందీ ఉండకూడదని, అందుకే పెళ్లి కూడా చేసుకోకూడదని, సంసార జంజాటంలో ఇరుక్కోకూడదని అనుకున్నాడు.

రెండవ తరగతిలో ఉండగా మొదలైన కష్టాలు పన్నెండేళ్ల వరకూ పంచానన్‌ను వెంటాడుతూనే ఉన్నాయి. ఇల్లు గడవడం కోసం పశువుల్ని కాసాడు. గడ్డికోసి మోపులుగా కట్టి అమ్మాడు. కావిళ్లతో మంచినీటిని ఇంటింటికి మోసాడు. తోపుడు బండి మీద కూరగాయలు అమ్మాడు. ఒక జౌళి మిల్లులో పనికి కుదిరి రాత్రిపూట చదువు మొదలుపెట్టాడు. బికాం.డిగ్రీ పూర్తిచేసి రాష్ట్రంలో ఉన్న శ్రీ రామకృష్ణమిషన్ ద్వారా పోస్టు గ్రాడ్యుయేషన్ చేశాడు. ఆ సమయంలో పశ్చిమబెంగాల్‌లో వివిధ పాఠశాలల్లో హిందీ పండితుల కొరత ఉందని తెలుసుకుని పరిచయ్, ప్రవీణ్, ప్రవేశ్, భాషాకోవిద్ వంటి పరీక్షలు రాశాడు. హిందీలో లభించిన ప్రావీణ్యం ఆధారంగా బిగ్డే హైస్కూలులో హిందీ పండిట్‌గా ఉద్యోగం లభించింది.

ప్రతీనెలా తనకు లభించే జీతంలో తన జీవనానికి అవసరమైనంత మేర ఉంచుకుని మిగిలిన సొమ్ము విద్యార్థులకు, పాఠశాలలకు విరాళంగా ఇచ్చేవాడు. 28 సంవత్సరాలుగా అతను అందించిన విరాళాలు లెక్కగట్టినట్లయితే మొత్తం 13 లక్షల రూపాయలుగా తేలింది. 685 పాఠశాలల్లో విద్యాభివృద్ధికి పేద విద్యార్థుల కోసం తన జీతంలో 90శాతం సొమ్ము విరాళంగా ఇచ్చేసాడు. 1974లో ఉపకారవేతన పథకాన్ని ఆరంభించి ప్రతి సంవత్సరం పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లను అందించేవాడు. పదవీ విరమణ చేసేంతవరకూ ఈ పథకాన్ని కొనసాగించాడు. రిటైర్ అయిన తర్వాత పించనుగా 5,331 రూపాయలు పించనుగా ప్రభుత్వం నిర్ణయించింది. బ్రహ్మచారిగా ఏ ఖర్చులేని వ్యక్తిగా కేవలం వెయ్యిరూపాయలు తన వద్ద ఉంచుకుంటూ మిగిలిన పించను సొమ్ము అంతా పేద విద్యార్థులకు పంచిపెడుతున్నారు.

ఆదర్శనీయ వ్యక్తిగా ఆ ప్రాంతంలో అందరూ పంచానన్‌ను గుర్తించారు. బెంగాల్‌లో ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న వారిని, చేసినవారిని 'మాస్టర్ మషాయ్' అని పిలుస్తుంటారు. డోమ్‌జడ్ ప్రాంతీయులంతా పంచానన్‌బాబు అని పదూయ్ మషాయ్ అని అతడిని అభిమానంగా పిలుస్తుంటారు.

* * *

డోమ్‌జడ్ ప్రాంతం.

ఇరుకు సందుల మధ్య ఉన్న పెంకుటిల్లు ముందు కారు ఆగింది.

ఆ కారులోంచి ఓ యువకుడు దిగాడు.

"పంచానన్ మాస్టర్ ఇల్లు ఇదే కదూ?" టీ కొట్టు బెనర్జీని అడిగాడు.

తోపుడు బండిపై 'టీ' లు అమ్ముతున్న బెనర్జీ, పంచానన్ ఇల్లు చూపాడు.

మెల్లగా తలుపుతట్టాడు.

"ఎవరూ?" అంటూ పంచానన్ బైటికి వచ్చాడు.

ఇంటిలోపల కిరోసన్ దీపం మాత్రమే ఉంది.

"నేను మిశ్రాను మాస్టర్ ... పదేళ్ల క్రితం మీ దగ్గర చదువుకున్నాను. మీరు చెప్పిన హిందీ వల్ల గ్రూప్‌వన్‌లో సెలక్టు కాగలిగాను. ప్రస్తుతం ఢిల్లీలో పనిచేస్తున్నాను. రెండురోజుల క్రితం పేపర్లో మీ సన్మానం వార్త చూశాను. మిమ్మల్ని కలుసుకోవడానికి వచ్చాను".

వీధిలైటు వెలుగులో మిశ్రాను పంచానన్ గుర్తుపట్టి కౌగిలించుకుని గదిలోకి తీసుకువెళ్లాడు. కర్రకుర్చీపైన కూర్చోబెట్టాడు.

గదంతా చీకటిగా ఉంది. చిన్న కిరోసిన్ దీపం గదికి పూర్తి వెలుగును ఇవ్వలేకపోతోంది. పంచానన్ ఆ దీపాన్ని తీసుకుని టేబుల్‌పైన పెట్టాడు.



చుట్టూ ఇళ్లల్లో వెలుగులు ఉండగా ఆ గది మాత్రం వెలుగు లేక మిణుకు మిణుకుమంటోంది.

"మీరు మారలేదు... మీ దానాలు మారలేదు..." మిశ్రా మెచ్చుకున్నాడు.

పంచానన్ గది అంతా చూశాడు. తన విద్యార్థికి ఏదైనా పెడదామని అనుకున్నాడు. కానీ ఇంటిలో ఏమీ కనిపించలేదు. రాత్రి భోజనానికి హోటల్‌కి వెళ్లవలసి ఉన్నందున మంచినీళ్లు తప్ప ఏమీలేదు. పంచానన్ పరిస్థితి గమనించి "చాలా సంవత్సరాల తర్వాత మిమ్మల్ని కలుసుకోవడమే గొప్ప ఆనందం. అదే నాకు చాలు..." అన్నాడు మిశ్రా.

తర్వాత వారిద్దరూ అనేక విషయాలు మాట్లాడుకున్నారు. ఇతర విద్యార్థులు, ఉపాధ్యాయుల గూర్చి చర్చించుకున్నారు. తర్వాత "మాస్టారూ! మీరు ప్రారంభించి, ఆపివేసిన ఉపకారవేతన పథకం మళ్లీ ప్రారంభించండి. డబ్బులు మీకు అవసరం లేదని నాకు తెలుసు. మీరు చేస్తున్న కృషికి నా చేయూతగా పదివేల రూపాయల డ్రాఫ్టు ఇస్తున్నాను. దీనిని కూడా పేద పిల్లల కోసం వినియోగించండి!" మిశ్రా జేబులోంచి డి.డి. పంచానన్‌కి అందించాడు.

పంచానన్ కళ్లల్లో ఆనందబాష్పాలు వెలువడ్డాయి.

"నా ఆశయాన్ని అర్థం చేసుకున్న నిన్ను అభినందిస్తున్నాను" అన్నాడు.

తర్వాత మిశ్రాలేచి నిల్చున్నాడు.

"ఇంట్లో కరెంటు లేదా? బల్బు పోయిందా"?

పంచానన్ రెండు నిమిషాలు జవాబు చెప్పలేదు.

తర్వాత నెమ్మదిగా "నేను ఇప్పుడు రాత్రిపూట చేసే పని ఏముంది. నాకు కరెంటు బల్బులు ఎందుకు, ఎలక్ట్రికల్ బిల్లుకు, బల్బులకు అయ్యే డబ్బు ఓ పేద విద్యార్థికి సాయపడుతుంది కదా!" పంచానన్ అన్నాడు.

అతని సమాధానం మిశ్రా కళ్లకు నీళ్లు తెప్పించాయి. "ఇటువంటి ఆదర్శమూర్తి వద్ద చదువుకోవడం నా అదృష్టం!" మనసులో అనుకొని ముందుకు కదిలాడు.

కారు వద్దకు వచ్చేసరికి దూరంగా రైలు శబ్దం వినిపించింది. దగ్గరగా అయి పెద్ద శబ్దంతో ముందుకు దూసుకుపోయింది. ఆ చుక్‌చుక్ శబ్దం ప్యాసినేటింగ్‌గా అనిపించింది. మిశ్రా కారు ముందుకు కదిలింది.

మేమూ సవ్యసాచులమే!

పి. జ్యోతి

అమ్మా నాకీ పెళ్ళొద్దమ్మా... అన్నా ఆవేదనగా ...

"రోజా! ఇంకా ఎన్నాళ్ళు పెళ్ళిని వాయిదా వేస్తావ్, నీకిప్పుడు పాతికేళ్ళు నిండాయి. నీ వయసుకి నేను అన్నయ్యను, నిన్ను, తమ్ముణ్ణి ముగ్గుర్ని కన్నాను. నువ్వింకా పెళ్ళికూడా చేసుకోకుండా ఎంతకాలం ఇలా తాత్సారం చేస్తావూ..." అమ్మ మాటలు పూర్తి కాకుండానే...

"నా వయసుకి, ఆనాడు అమ్మమ్మ, ఆరుగుర్ని, నువ్వు ముగ్గుర్ని, రేపు నేను పెళ్ళి చేసుకుని ఇద్దర్ని కనడమేనా అమ్మా జీవితం, అలాంటి బ్రతుకు నాకొద్దమ్మా, ఇన్నాళ్ళూ స్వేచ్ఛగా నీ లాలనలో, నాన్న పాలనలో హాయిగా గడుపుతున్న జీవితాన్ని పెళ్ళి అనే బంధంతో, ఎక్కడో పుట్టి పెరిగిన ఒక మగవాడు ఆ క్షణం నుండీ నాపై తనకులేని అధికారాన్ని చేజిక్కించుకుని భర్త అన్న పేరుతో, చిన్న నాటి నుంచి నాలో వున్న కోరికలన్నింటినీ నాలోనే సమాధిచేసి, నన్నింతదాన్ని చేసిన మీముందే నన్ను శాసిస్తూ మీకూ, నాకూ ఏ సంబంధం లేనట్టు మాట్లాడుతూ వుండే సంసారజీవితం నాకొద్దమ్మా" కాలితో ఒక్క తన్ను తన్నాననుకున్నాను. కానీ నా కాలికే ఏదో తగిలినట్టనిపించింది.

"ఏంటి రోజా నువ్వు మాట్లాడేది. ఇన్నాళ్ళూ చదువు అన్నావ్. అది పూర్తయింది. ఆ తరువాత ఏదైనా జాబ్ రానీయ్ అన్నావు. అది కూడా నెరవేరింది. మరిపుడు ఇలా... అందరు మగవాళ్ళూ నువ్వనుకున్నట్టుగా వుండరమ్మా. ఎక్కడో ఎవరో ఏదో పొరపాటుగా ప్రవర్తించినంత మాత్రాన నీకూ అలా జరుగుతుందని ఎందుకు భ్రమపడతావ్, ఆడదానికి పెళ్ళితోనేనమ్మా ఆనందం, తల్లిస్థానం లభించడంలోనేనమ్మా పరిపూర్ణత, నీవింకా చిన్నపిల్ల మనస్తత్వం విడనాడలేదు. పెద్దదాన్నిగా, నీ తల్లిగా నీ మేలు కోరి చెబుతున్నా . నా మాట విని ఈ సంబంధం అయినా ఖాయం చేసుకోనీ"

"ఎందుకమ్మా హాయిగా వున్న నా జీవితాన్ని పెళ్ళి అనే బంధంలో బంధించాలని చూస్తావ్" ఆవేశంగా చేయి విసిరా...విసిరిన ఆ చెయ్యి దేనికో తగిలింది. దెబ్బ తగిలితే నేనబ్బా అనాలి...కానీ ఎక్కడినుంచో ఎవరినోటి నుంచో, చిన్నపిల్ల గొంతులా వచ్చిందేవిటబ్బా...

"అంటే నీ ఉద్దేశ్యం పెళ్ళయిన వాళ్ళంతా బాధలే పడుతున్నారనా? నిన్నర్థం చేసుకునే సహృదయం కలవాడు నీకు భర్తగా వస్తాడని ఎందుకనుకోవు?" అమ్మ ఇంకా నచ్చచెప్పే పనే చేస్తోంది.

"అమ్మా! నీ అమాయకత్వం చూస్తూంటే నాకూ వెర్రినవ్వు వస్తోంది. అప్పుడే అన్నీ మరిచిపోయావమ్మా. అకటకటా... నువ్వే చెప్పావు నాకీ విషయాలన్నీ.. నాడు అమ్మమ్మకు సంగీతం అంటే ఎంతో ప్రాణం అనీ, తను గొంతెత్తి పాడితే కోయిలలు కూడా చెవులు రిక్కించి మరీ వినేవనీ, ఆమెకు రేడియోలో కూడా పాడే అవకాశం వచ్చిందనీ చెప్పావు. అంతలోనే తాతగారితో పెళ్ళి...తుతుతూ...డుండుండుమ్. హయ్యారే...అకటకటా... అంటే ఆయన సంప్రదాయపు కట్టుబాట్లు, ఆచార వ్యవహారాలు, మడీ, తడీ అంటూ ఆమెకు బురఖా తగిలించి బయటకు అడుగుపెట్టనీకుండా వంటింటికే ఆమె జీవితాన్ని అరెస్టు గావించెను కదా... లేకుంటే ఆమె సంగీత సామ్రాజ్యంలో ఒకతారలా వెలిగేదికదా! అంటే అమ్మమ్మ కోరికల్ని ఒక భర్త అనే మగవాడి కోసం అంకురంలోనే ఆర్పేసుకుందికదా మరి. హూ! ఇంక నీ విషయానికొస్తే నీకు చదువంటే ఎంతో ఇష్టం. కానీ ఆనాడు ఐదోక్లాస్ అవ్వగానే నాన్నతో ఏడడుగులు వేశావు కదే...నీ ఇష్టంతో ప్రమేయం లేకుండానే తాతగారు ఓ బ్రాహ్మణ్ణి పిలుచుకొచ్చి "మాంగల్యం తంతునా..." అని నీ పెళ్ళితంతు చేశారు కదా మాతా. నువ్వు నోరు తెరిచి నాన్నగారితో "ఏవండీ నాకింకా చదువుకోవాలనుందీ" అని అడిగానన్నావు, కానీ ఆయన నీ మీద అధికారంతో నీ మాటలను నీ గొంతులోనే నొక్కేసి, పెళ్ళి చేసుకున్నదానివి ఇంకా బయటకువెళ్ళి చదువుకోవటం ఎందుకూ... అయినా ఇప్పుడు నువ్వు

చదివి ఎవరిని వుద్ధరించాలనీ... నీకంత ఇష్టంగా వుంటే నీ పిల్లల్ని చదివించుదువుగానీ అనీ నీ కోరికని నీ లోనే సమాధి చేసాడా, అలా చేసే అధికారం ఆయనకెవరిచ్చారు. ఈపెళ్ళి అనే బంధమే కదూ... అందుకే...అందుకే మాతా... నాకు పెళ్ళి మీదే విరక్తి కలిగింది జననీ... మళ్ళీ ఆ వూసెత్తకు". ఎక్కడినుంచో చప్పట్లు కొట్టి ఈల పీకిన చప్పుడు. వన్స్‌మోర్ అన్న అరుపు. ఎక్కడినుంచో మాత్రం అర్థం కావట్లేదు.

"రోజా నాటి పరిస్థితులు వేరు, నేటి పరిస్థితులు వేరు, మారాయమ్మా. ఇప్పుడు నువ్వు కావలసినంత చదువుకుని చక్కని ఉద్యోగం చేస్తున్నావ్, నీకు మాలాంటి బాధలు వుండవమ్మా, నా మాట విని పెళ్ళికి ఒప్పుకో తల్లీ, నా బంగారుతల్లివి కదూ". అమ్మ ఇంకా బతిమాలే సీను కంటిన్యూ చేస్తోంది.

"అబ్బా! అమ్మా పెళ్ళయిందంటే చాలు ఆ భర్త అనే మగవాడికి నేను భర్తను అన్న అహంకారం వస్తుంది. నా సంపాదనను నా ఇష్టానుసారంగా ఖర్చుపెట్టుకోనీయడు, చేతకాని వయసులో వున్న నా తల్లి తండ్రుల్ని నా ఇంట్లో వుంచుకుని చూసుకోనీయడు. అడుగడుగునా అనుమానం... ప్రతీదాన్ని భూతద్దంలో పెట్టిచూట్టం... సాటి మగవానితో మాట్లాడితే శాడిస్టులా వేధించటం.. ఎన్నో రకాల మగవాళ్ళను చూడటంలేదూ. ఇంతేకాదు నాకూ కొన్ని సిద్ధాంతాలున్నాయ్. అవి నిరాటంకంగా సాధించాలంటే నేను ఒంటరిగానే సాధిస్తాను. నేనకున్నది తప్పక సాధిస్తాను" నా మాటలు నాకే ప్రతిధ్వనిస్తూ వినిపిస్తున్నాయ్. ఎవరో నన్ను పట్టి ఊపి లేపుతున్నట్లుంది.

"ఏయ్ రోజా ఏంటి సాధిస్తానంటున్నావ్, పగటికలలేమైనా కంటున్నావా కళ్ళు తెరువు" అంటూ నా భర్త కార్తీక్ నన్ను గట్టిగా కుదుపుతున్నాడు. అంటే ఇదంతా నా పెళ్ళికి ముందు జరిగిన సంఘటనల తాలూకు జ్ఞాపకాలా? నా ఎదురుగా నా పిల్లలిద్దరూ బిక్కమొహం వేసుకుని నన్ను వింతగా చూస్తున్నారు.

మా పెద్దది "ఏంటే అమ్మా మంచం పట్టీని లాగిపెట్టి ఢిష్యూం అన్నావు. ఆ దెబ్బకు నేనూ చెల్లాయి ఫైటింగ్ సీననుకుని నాన్న పరిగెత్తుకు వచ్చాడు" అంది.

మా చిన్నది, "మలే మలే అమ్మీ నిన్నూ...నీను... నీ బుగ్గమీద చుమ్మాపెత్తి లేపుదామని వస్సే...అత్తా కొత్తావే అమ్మా. ఛీ పో నీతో పచ్చీ...కటీఫ్..." అని వాళ్ళ నాన్న చంకనెక్కింది. ఇక వారు మా నవ్వారుగారు సరేసరి. "రోజా నీ పెళ్ళిచూపులప్పుడూ చెప్పలేదేం..నీకు నటనానుభవం ఉందని...అదరగొట్టేశావ్ ఇందాక నిద్దట్లో...ఉండబట్టలేక ఈలకొట్టి వన్స్‌మోర్ అనేశా" అంటూ ఆటపట్టింపు పట్టారు.

అంటే ఇలా పగటికలలు కంటూ నేనుకూడా, అమ్మమ్మలా, అమ్మలా పెళ్ళి చేసుకుని పిల్లల్ని కనడంతప్ప నేననుకున్నదేదీ సాధించలేదా ఇంతవరకూ...

"నో! నెవ్వర్! అలా జరగటానికి వీల్లేదు. ఇప్పటికైనా మించిపోయింది లేదు. నేను నేటి మహిళను. పెళ్ళికి ముందు నాలోవున్న కోరికల్ని సాధించుకోటానికి, ఈ భర్తా పిల్లలు ఆటంకం ఎంత మాత్రం కాదు. ఇంటా బయటా అన్ని పనులనూ సమర్థవంతంగా సవ్యసాచిలా నిర్వహించి నేను ముందుకు వెళ్తేనే, రేపు నా పాప కూడా మరింత ముందుకు వెళ్ళే ప్రయత్నం చేస్తుంది. తనకి నేనొక దారి చూపిన దాన్నవుతా. ఇలా అనుకున్న తర్వాత కానీ నా మనసుకు తృప్తి కలుగలేదు. పురాణాల్లో ఆనాడు ఒక్క అర్జునిడికి మాత్రమే సవ్యసాచి అని పేరు కొట్టేశాడు. కానీ నేడు ఇంటా బయటా సమర్థవంతంగా పనులను నిర్వహించి ప్రధానపాత్ర వహించే ప్రతీ స్త్రీ ఒక సవ్యసాచే కదా...

లబోదిబో... దిబోలబో”

“ఒరె తిరపతీ... ఇంగనైనా గీ తాగుడు బందు చేయరాదుర...” జక్కులోడు తిరపతిని మందలిచ్చిండు. వాడు వికవిక నవ్వి ఓసారి మీసం మెలి తిప్పిండు.

“అరె... ఇల్లంత గుల్లయిపోతంది గాదుర... పండిన పంట... పొలమ్మీదొచ్చే డబ్బులు... గవన్నీ తాగుడికే తగలబెడ్తే రేపెట్ల గడుస్తదిర” జక్కులోడు వాడిమీద గజం ఎత్తున ఎగిరెగిరి పడ్డడు. తిరపతిగాడు మాత్రం ముసి ముసి నవ్వులు నవ్వుతండు. చేసేదిలేక జక్కులోడు చప్టామీద కూలబడి నిట్టూర్చిండు.

అపుడే మరో తాగుబోతు గురివిగాడు ఆదరాబాదరాగా ఎగబోసుకుంటు అడికి వచ్చిండు. వాడ్ని చూడంగనె తిరపతి సైగలేవో చేసిండు. వాడుకూడా మూతీ చేతులు తిప్పి సైగలు చేసిండు. గని వాడికర్థం గాక ధుమధుమలాడి ఓ రంకె వేసిండు.

తర్వాత ఇద్దరు నడుసుకుంటుపోయి గక్కడ్నే వున్న గుడి అరుగుల మీదికి చేరి గుసగుసలకు తగులుకున్నరు.

జక్కులోడికి అనుమానమొచ్చింది.

తాగుబోతులిద్దరి గుసగుసలేంది? తాగుడు గురించే ఏదో పన్నాగం తయారుచేస్తరు. ఎవడికో ఒకడి పెండ్లాం ముక్కుపుల్లో... చెవిదుద్దులో తెచ్చి కుదవచేసి దీంతోని మందు మింగాలనేదే అయివుంటుంది. అబ్బో... కుదర్దు... అటు తిరపతిగాడి పెండ్లాం నోరు మహాగొప్పది. అదిగాని దాన్ని పూరాగా విప్పితే సగంవూరు వులిక్కిపడతది. అదురుకుంటది. దాని తిట్లపురాణం చాలా పొడవైంది. ఆపినా ఆగదు. వామ్మో!

మరి గురివిగాడి పెండ్లాం పాపం నోరులేని జీవి. సాధు జంతువు. దాని కస్సలు మాట్లాడ్డవే చాతకాదు. ఏది ఏమయినా దానిది చేతివాటమే! కాయకష్టం చేసిన శరీరమాయె. వుక్కు కడ్డీలాగుంటది. ఇద్దరు ముగ్గురు మగవాండ్లను ఒక్కచేత్తో లేపి అవతలకు విసిరి పారేస్తది. నోరులేని జీవిగదా... చేతి దెబ్బతోనే నెట్టుకొస్తంది. అందుకే దానిముందు గురివిగాడు నోటికి తాళం వేసుకుంటడు. ఎందుకంటే ఇంతకు ముందు అది చాలాసార్లు గురివిగాడి మీద తన చేతిదెబ్బను పరీక్ష చేసింది. ఒకసారి ఆ దెబ్బకు గురివిగాడి గూడవొదులై సర్కారు దవాఖానలో వారం రోజులుండిపోయిండు.

ఉహు... వీళ్ళు గట్లాంటి ప్రయోగాలు చెయ్యరు.

కొద్దిసేపట్లో ఇద్దరు ఉషారుగా ఈల లేసుకుంటు రావిచెట్టుతానకు వచ్చింద్రు.

“అరె... ఏందిర... మహా సంబురం గున్నరు. మందు పన్నాగం తయారయినదిర. ధుత్” జక్కులోడు ఈసడించిండు.

“అరె జక్కులోడా... ఇంగముందునుండి మేం ఒకళ్ళ దగ్గరకుపోయి తాగడం లేదు. పదిమంది మాతాన వచ్చి ‘నీ బాంచను’ అని తాగాలె... పార...పా”

తిరపతి జవాబుకు జక్కులోడిలో కంపరం పుట్టుకొచ్చింది.

“ఏందిర... గుడంబ కార్ఖాన గిన పెదతాండ్రార... పోలీసులు పట్కపోయి బొక్కలనూకి బొక్కలు గరం గరం చేస్తరు... జర పదిలం!”

జక్కులోడి మాటలు వినిపిచ్చుకోకుంటా గురివిగాడు పొడిపొడిగా “బ్రాందిషాపు పెడ్తన్నంర జక్కులోడా... గవర్మెంటు కొత్త బ్రాంది దుకానాలకు లైసెన్సులిస్తంది. రేపు డిపాజిట్లు కడ్తన్నం... గీ వూర్లె గిపుడు నాలుగు వుండె...మాది అయిదవది”.

జక్కులోడు విరుచుకపడి వెంటనే తేరుకుని వాడి చేయందుకుని చప్టామీదకు లాగిండు.

“ఒరె...ఒరె... గీ మతలబు బాగుందిర... జర యివరం చెప్పవార”

వాడు చెప్తుంటే తిరపతి బీడీ బదులు సిగరెట్టు వెలిగిచ్చి పొగనొదులుకుంటు కూలబడ్డడు.

“మరి గిపుడు డిపాజిటు రెండో మూడో లచ్చలు కట్టాలె గద... అటెనక అయిదారు లచ్చల సరుకు తేవాల్నాయె...” జక్కులోడు చప్పరించుకుంట అన్నడు.

“ఒరె లైసెన్సు వస్తే బ్యాంకోడు లచ్చలు అప్పిస్తనని చెప్పింద్రు ... కానీరా... (రహస్యంగా) బ్లాకు సరుకు తెచ్చి అమ్మితే సగానికి సగం లాభం... మామూలు అయితే అన్ని కర్చులు పోయి పాతిక శాతం. అబ్బో... సంవత్సరంల మారుతీకారు కొనుక్కోవచ్చు...

జక్కులోడికి మళ్ళీ మూర్ఛ వచ్చినంత పనయ్యింది. నిభాయించుకున్నాడు. ‘మరి గీ లైసెన్సు పెట్టుబడెట్లరా...” ఎర్రిమొహం పెట్టి అడిగిండు.

గపుడే దూరం నుండి తిరపతిగాడి నోటి దురుసు పెండ్లాం... గురివిగాడి చేతివాటం పెండ్లాం బాగ అలంకరణలు చేసుకుని అక్కడికే వచ్చింద్రు.

“ఏందయ్యా... రెడ్డిగారి తాన పోయొస్తనని గీడ కూలబడ్డవే...” తిరపతి భార్య తన జీవితంలో అంత కోమలంగా, షోకుగా ఎన్నడూ మాట్లాడలేదు. జక్కులోడు వుక్కిరిబిక్కిరయ్యాడు.



“పెదకాపు తాన పోతనంటివి” గురివిగాడి భార్య సున్నితంగా తన మొరటు చేతుల్ని భరతనాట్యం భంగిమలో ముచ్చటగా వూపింది. తర్వాత వాళ్ళు కూలబడ్డరు.

“వీడో లచ్చ... నేనో లచ్చ తయారు చేస్తున్నం... నా పొలం కుదవకేసిన. రెండు బరిగొడ్లమ్మిన... దీని వంటిమీది ఆరుతులాల గొలుసమ్మిన... మొత్తానికి 90 వేలు తయారయినై... ఇల్లు కుదవకేస్తే పదివేలు వస్తయి...” తిరపతి చెప్తండు.

“నా తోట చెక్క మొత్తం అమ్మిన... మెరక పెరగమ్మిన... పాతికవేలు మిత్తికి తెచ్చిన. ఏందీ చెప్పవూ” గురివిగాడు అన్నాడు.

“అవునన్నా... ఇద్దరం కలిసి రెండు లచ్చలు తయారు చేసినం... నువుగాని పార్టనరుగా చేరాల్నంటే ఓ యాభైవేలు తయారుచెయి. అందరం కలిసి గీ బరాండీ అమ్ముదం”

జక్కులోడు మూలిగాడు.

❂ ❂ ❂

వాళ్ళు డిపాజిట్లు కట్టింద్రు. షాపు వచ్చేటట్లుంది. గీ లోపున కోర్టుతీర్పు వచ్చింది. షాపులు రద్దయినయి. డి.డి.లు వాపసు యివ్వమని గోలకు తగులుకున్నరు. ఇవ్వటం లేదు.

ఇన్‌కంటాక్సు వాళ్ళవేట, ఆరాలు మొద లయ్యాయి. ఫైళ్ళు తెప్పిచ్చుకున్నరు. టాక్సులు కట్టాలన్నరు. రెండు లచ్చలకు అరవై వేలు టాక్సు వదిలింది. కొంప మునిగింది. పైగా డిపాజిటు కట్టిన వాళ్ళందరూ టాక్సులిస్టులో చేరిపోయింద్రు. సారా షాపు రాలే... లబోదిబో! ఇన్‌కమ్ టాక్సు పడింది... దిబోలబో... ❂

స్త్రీలలో ఆరోగ్య ఇబ్బందులు సృష్టించే యుటెరైన్ ఫైబ్రాయిడ్‌లు

యుక్త వయస్సులో గల కొందరు స్త్రీలలో ఆరోగ్య ఇబ్బందులు సృష్టించే వాటిలో యుటెరైన్ ఫైబ్రాయిడ్‌లు పేర్కొనదగినవి. వీటినే వైద్యశాస్త్ర పరిభాషలో మయోమా లేదా లియోమయోమాలుగా పేర్కొంటుంటారు. ఇవి స్త్రీల గర్భాశయంలో పెరిగే లేదా వచ్చే అతి సాధారణ 'బినైన్ ట్యూమర్'లు. ఇవి క్యాన్సర్ సంబంధ ట్యూమర్‌లు కావు. అందువల్లనే వీటిని బినైన్ ట్యూమర్‌లుగా పేర్కొంటారు

ఇవి చాలా నిదానంగా పెరుగుదలను చూపుతాయి. ప్రమాదకరంగా కావు. (క్యాన్సర్ సంబంధ ట్యూమర్‌లను మాలిగ్నెంట్ ట్యూమర్‌లు అంటారు. ఇవి చాల వేగంగా పెరుగుదలను చూపుతాయి. ఇవి ప్రమాదకరమైనవి.)

మొత్తం స్త్రీలలో 10-20 శాతం స్త్రీలలో యుటెరైన్ ఫైబ్రాయిడ్‌లు కనిపిస్తున్నాయి. ముఖ్యంగా సంతానోత్పత్తి దశలో గల స్త్రీలలో ఎక్కువగా వస్తాయి. సాధారణంగా యుటెరస్‌లో ఒక ఫైబ్రాయిడ్ (సింగిల్ ఫైబ్రాయిడ్) వస్తుంది. కాని అప్పుడప్పుడు కొందరిలో ఒకటి కంటే ఎక్కువ ఫైబ్రాయిడ్‌లు (మల్టిపుల్ ఫైబ్రాయిడ్స్) వస్తాయి.

ఫైబ్రాయిడ్స్ రావడానికి కారణాలేమిటి?

స్త్రీల గర్భాశయంలో ఫైబ్రాయిడ్‌లు రావడానికి ప్రత్యేకమైన కారణాలను వైద్యశాస్త్రం స్పష్టం చేయలేకపోతోంది. వంశపారంపర్యంగా వచ్చే అవకాశం మాత్రం వుంది. 30 సంవత్సరాలలోపు ఫైబ్రాయిడ్‌లు రాకపోతే తర్వాత వచ్చే అవకాశాలు దాదాపుగా లేవనే చెప్పవచ్చు.

పిల్లలు పుట్టని లేదా ఒకరు పుట్టిన స్త్రీలలో ఫైబ్రాయిడ్‌లు ఎక్కువగా కనబడుతున్నాయి.

ఫైబ్రాయిడ్‌లు-రకాలు

యుటెరైన్ ఫైబ్రాయిడ్‌లను వివిధ రకాలుగా పేర్కొంటుంటారు. ఏర్పడిన భాగాన్ని బట్టి యుటెరైన్ ఫైబ్రాయిడ్‌లను మూడు రకాలుగా విభజించారు.

☆ **యుటెరైన్ ఫైబ్రాయిడ్‌లు:** ఇవి యుటెరస్‌లోనే ఏర్పడతాయి.

☆ **సర్వైకల్ ఫైబ్రాయిడ్‌లు:** ఇవి యుటెరస్‌లోని సర్వైకల్ రీజియన్‌లో ఏర్పడతాయి.

☆ **బ్రాడ్ లిగమెంటల్ ఫైబ్రాయిడ్‌లు:** ఇవి యుటెరస్‌ను స్థానంలో పట్టి ఉంచే లిగమెంట్‌లో ఏర్పడతాయి.

మరో విభజన కూడా వుంది. ఫైబ్రాయిడ్‌లు పుట్టిన ప్రదేశం ఆధారంగా ఈ విభజనను చేయడం జరిగింది. ఇందులో సీరోజల్ ఇంట్రామ్యూరల్, సబ్ మ్యూకోజల్ ఫైబ్రాయిడ్‌లుగా విభజించడం జరిగింది. ఇవి వివిధ సైజులలో వుండవచ్చును. కొన్ని గ్రాముల నుంచి కిలో గ్రాముల వరకు పెరుగవచ్చును. సాధారణంగా ఒకటి కన్నా ఎక్కువ ఫైబ్రాయిడ్‌లు పుడతాయి. ఒక్కొక్కరిలో 100కు మించి ఉండడాన్ని గుర్తించడం జరిగింది.

ఫైబ్రాయిడ్‌లు-అనారోగ్య లక్షణాలు

యుటెరస్ (గర్భాశయం)లో ఏర్పడిన ఫైబ్రాయిడ్‌ల పరిమాణం, సంఖ్య, పుట్టిన ప్రదేశం మొదలయిన అంశాల ఆధారంగా అనారోగ్య లక్షణాలు బయటపడతాయి. ముఖ్యంగా బహిష్టులలో అసాధారణతలు చోటు చేసుకుంటాయి. సాధారణంగా బహిష్టు ఉండే రోజుల కన్నా ఎక్కువ రోజులు బ్లీడింగ్ కావచ్చును. దీనినే వైద్య శాస్త్ర పరిభాషలో 'మెనోరేజియా' అంటారు. నెలలో మధ్యలో కూడా బ్లీడింగ్ కావచ్చును. తక్కువ రోజులకే పీరియడ్స్ వచ్చి ఎక్కువ రోజులు ఉండవచ్చును. బాహ్యంగా పొత్తికడుపులో నొప్పి రావచ్చును. ఈ నొప్పి రావడం అనేది ఫైబ్రాయిడ్‌ల పరిమాణంపై ఆధారపడి వుంటుంది. బరువు పెరిగేకొద్దీ ప్రెజర్‌కు గురై పొట్టలో బరువు అనిపించవచ్చును. ఫైబ్రాయిడ్స్ కలిగిన స్త్రీలు సాధారణంగా రక్తహీనత (అనీమియా)ను కలిగి వుంటారు. పిల్లలు పుట్టకపోవచ్చును. ప్రెగ్నెన్సీ వచ్చినా గర్భస్రావం (అబార్షన్) జరుగవచ్చును.

ఫైబ్రాయిడ్‌లు- ప్రమాదకర కాంప్లికేషన్‌లు

ఫైబ్రాయిడ్‌లు లోపల టార్షన్‌కు గురై అంటే మెలిక పడి ప్రమాదకర పరిస్థితులకు దారి తీయవచ్చును. దీనినే "వాండరింగ్ ఫైబ్రాయిడ్"గా పేర్కొంటారు.

ఫైబ్రాయిడ్ చుట్టి వుండే క్యాప్స్యూల్స్ విచ్ఛిన్నం కావచ్చును. ఇన్‌ఫ్లమేషన్‌కు, ఇన్‌ఫెక్షన్‌కు గురై ఆరోగ్య సమస్యలను తీవ్రతరం చేయవచ్చును.

ప్రెగ్నెన్సీ- ఫైబ్రాయిడ్‌లు

ప్రెగ్నెన్సీకి, ఫైబ్రాయిడ్‌లకు అవినాభావ సంబంధం వుంది. ప్రెగ్నెన్సీ సమయంలో ఉత్పత్తి అయ్యే హార్మోనులు ఫైబ్రాయిడ్‌లపై ప్రభావం చూపుతాయి. ఫలితంగా ఫైబ్రాయిడ్‌ల పరిమాణం పెరుగుతుంది. ముఖ్యంగా ఈస్ట్రోజన్ ప్రభావం వల్ల ఫైబ్రాయిడ్‌ల సైజులు పెరుగుతాయి. యాండ్రోజెన్‌లు, గొనాడో

ట్రోఫిన్ రిలీజింగ్ హార్మోన్‌లు, ఫైబ్రాయిడ్‌ల పరిమాణం కారణంగా ప్రెగ్నెన్సీలో సమస్యలు తలెత్తవచ్చును. ఫైబ్రాయిడ్‌లు కలిగిన స్త్రీలు గర్భం ధరించినప్పుడు తప్పని సరిగా వైద్యుని పర్యవేక్షణలో వుండాలి. ప్రసవం తర్వాత ఫైబ్రాయిడ్‌ల సైజు తగ్గిపోతుంది.

ఫైబ్రాయిడ్- నిర్ధారణ పరీక్షలు

బాహ్యంగా అబ్డామెన్‌ను పరీక్షిస్తే ఫైబ్రాయిడ్‌లు గడ్డల రూపంలో చేతికి తగలవచ్చును. బహిష్టులోని అసాధారణతలు ఫైబ్రాయిడ్‌ల నిర్ధారణ కొంత వరకు దోహద పడతాయి. అయితే అల్ట్రాసౌండ్ స్కానింగ్ ద్వారా కచ్చితంగా నిర్ధారించవచ్చును. హిస్టిరో సాల్పింగోగ్రామ్, హిస్టిరో స్కోపి, డయాగ్నోస్టిక్ లేపరోస్కోపి, యుటేరైన్ యాస్పిరేషన్ సైకాలజీ వంటి పరీక్షలు కూడా ఫైబ్రాయిడ్‌ల నిర్ధారణకు ఉపయోగపడతాయి.

ఫైబ్రాయిడ్‌లు- చికిత్సా పద్ధతులు

ఫైబ్రాయిడ్‌లకు అనుసరించే చికిత్సా పద్ధతి ఆయా స్త్రీల వయస్సు, ఆరోగ్య సమస్యలపై ఆధారపడి వుంటుంది. సంతానోత్పత్తి దశలో ఉండి పిల్లలు కావాలనుకునే స్త్రీలకు యుటెరస్‌ను ప్రిజర్వ్ చేసే చికిత్సా పద్ధతిని అనుసరిస్తారు. పిల్లలు కలిగిన వారికి, వయస్సు ఎక్కువవున్న వారికి యుటెరస్‌ను తొలగించే శస్త్ర చికిత్సకు ప్రాధాన్యత యిస్తారు. ఇప్పుడు ఈ చికిత్సా విధానంలో లాపరోస్కోపిక్ పద్ధతులు అందుబాటులోకి వచ్చాయి. ఈ పద్ధతుల వల్ల కొన్ని ప్రయోజనాలున్నాయి. ఉదరంపై చిన్న స్కార్ మాత్రమే కనబడుతుంది. రక్తం ఎక్కువగా పోదు. ఎక్కువ రోజులు ఆసుపత్రిలో వుండనక్కరలేదు. సాధారణంగా పనులు వెంటనే చేసుకోవచ్చును. ఫైబ్రాయిడ్ పరిమాణం చాలా పెద్దదిగా వుంటే తొలుత మందుల ద్వారా లేదా ఆర్టీరియల్ సప్లైను తగ్గించడం ద్వారా సైజును తగ్గించి తర్వాత శస్త్ర చికిత్స నిర్వహిస్తారు. ఏది ఏమైనా ఫైబ్రాయిడ్ చికిత్సా విధానం అనేది ఆయా వైద్య నిపుణులపై ఆధారపడి వుంటుంది.



(హెల్త్ హెల్ప్ సౌజన్యంతో)

దంత సంరక్షణ

క్విజ్-10

నిర్వహణ:
డా॥ కె.ఎల్.వి. ప్రసాద్, హన్మకొండ

1. నోటి దుర్వాసనకు కారణం
   అ) పిప్పిపన్ను
   ఆ) ఎగుడుదిగుడు పళ్ళు
   ఇ) చిగురువ్యాధులు
   ఈ) అన్నీ కరక్ట్
2. నోటి పరిశుభ్రతలో పళ్ళు తోముకోవడంతోపాటు
   అ) నాలుక గీసుకోవాలి
   ఆ) చిగుళ్ళు మర్దనా చేసుకోవాలి
   ఇ) నోరు పుక్కిలించాలి
   ఈ) అన్నీ అవసరమే
3. నోటిని నిత్యం తడిగా వుంచే సహజ పరిశుభ్రతకు కారణమయ్యే సహజద్రవం
   అ) హైడ్రోజన్ పెరాక్సైడ్
   ఆ) లాలాజలం
   ఇ) క్లోర్ హెక్సిడిన్
   ఈ) డిస్టిల్డ్ వాటర్
4. నోరు ఎండిపోవడాన్ని సాంకేతికంగా యిలా పిలుస్తారు.
   అ) డ్రై - మౌత్
   ఆ) డ్రై- ఓరల్‌కేవిటి
   ఇ) జిరోస్టోమియా
   ఈ) అన్నీ కరక్టే
5. 'లాలాజలం' ఉపయోగం
   అ) నోటి సహజ శుభ్రత
   ఆ) వ్యాధి నిరోధక గుణం
   ఇ) నోటిని నిరంతరం తడిగా ఉంచడం
   ఈ) అన్నీ కరక్ట్
6. లాలాజలాన్ని సహజంగా ఉత్పత్తి చేసే పెద్ద లాలాజలగ్రంథి
   అ) పెరోటిడ్ గ్రంథి
   ఆ) పాలిటల్ గ్రంథి
   ఇ) లింగ్వల్ గ్రంథి
   ఈ) సబ్-మ్యాండిబ్యులార్ గ్రంథి
7. 'పిప్పిపన్ను' వ్యాధికి చెవిలో పసరు పోయడం
   అ) మేలైన చికిత్స
   ఆ) చక్కని ప్రథమ చికిత్స
   ఇ) కేవలం మూఢనమ్మకం
   ఈ) అంతర్జాతీయ చికిత్సా విధానం
8. 'పిప్పిపన్ను' వ్యాధికి చికిత్స
   అ) ఔషధ చికిత్స
   ఆ) మూల చికిత్స
   ఇ) ఫిల్లింగులు
   ఈ) స్థాయిని బట్టి అన్నీ అవసరమే!
9. సహజంగా పిప్పిపన్ను వ్యాధిని యీ లక్షణం ద్వారా తెలుసుకుంటారు.
   అ) పంటి రంధ్రం
   ఆ) పంటినొప్పి
   ఇ) పన్ను జివ్వుమనడం - జ్వరం రావడం
   ఈ) అన్నీ
10. 'పిప్పిపన్ను వ్యాధి' కి పన్ను తీయించుకోవడమే ప్రధాన చికిత్స విధానం
   అ) అవును
   ఆ) కాదు
   ఇ) కావచ్చు
   ఈ) కాకపోవచ్చు

జవాబులు:
1) ఈ 2) ఈ 3) ఆ 4) ఇ 5) ఈ
6) ఆ 7) ఇ 8) ఈ 9) ఈ 10) ఆ

అమెరికా "దుష్టరాజ్యం"

దుష్టరాజ్యం
విలియం బ్లమ్
వెల: రూ. 35/-
పేజీలు:102
ప్రతులకు: ప్రజాశక్తి బుక్‌హౌస్
1-1-187/1/2,
చిక్కడపల్లి
హైదరాబాద్

పెద్దన్న ముసుగులో అమెరికా ప్రపంచదేశాల సార్వభౌమత్వాన్ని దెబ్బతీసే అనాగరిక చర్యలను నిశితంగా విమర్శించిన విలియం బ్లమ్ అమెరికా దుష్టచర్యలపై అనేక పుస్తకాల్ని రాశారు. వీటిని ప్రపంచదేశాల్లోని ప్రజలందరికీ చేరేట్లు చేయడం ప్రజాస్వామ్యవాదులుగా, ఆత్మగౌరవాన్ని కోరుకునే వ్యక్తులుగా అవశ్యం. ఆ క్రమంలోనే ప్రజాశక్తి బుక్‌హౌస్ "దుష్టరాజ్యం" పేరుతో తెలుగులోకి అనువదించింది. రోజురోజుకీ అమెరికా పలుదేశాల్లో సృష్టిస్తున్న అరాచకాలు, దుర్మార్గాలు, సూక్ష్మంగా విలియం బ్లమ్ వివరించారీ పుస్తకంలో. రచయిత అమెరికా విదేశీయ శాఖలో పనిచేస్తూ తను పరిశీలించిన అమెరికా వింత వికృత చర్యల్ని ప్రపంచదేశాలకి విప్పిచెప్పే క్రమంలో ఎన్నో ఒడిదొడుకులు ఎదుర్కొన్నారు. అతని ప్రతీ అక్షరం అమెరికా దమననీతిని సూటిగా ప్రశ్నించేట్లుగా పదునుతేలింది.

ఈ పుస్తకాన్ని మూడు భాగాలుగా విభజించారు. మొదటి భాగంలో అమెరికా పెంచి పోషించిన తన ఆధిపత్యాన్ని అన్నిదేశాల్లో విస్తరించుకోవడానికి సృష్టించుకున్న టెర్రరిజం అనంతర కాలంలో ఏవిధంగా పరిణామం చెందిందో వివరించారు. అమెరికా రాజకీయ హత్యలు, సి.ఐ.ఏ. దమన నీతి, యుద్ధాల్లో పట్టుబడిన ఇతరదేశాల సైనికుల్ని చిత్రహింసలకు గురిచేసే హేయమైన చర్యల్ని చాలా సూక్ష్మంగా, సూటిగా విమర్శించిన తీరు ఒళ్ళు గగుర్పొడ్చేట్లుగా ఉంది. జననాంగాలకు ఎలక్ట్రిక్‌షాక్ ఇవ్వడం, ఇనుపకడ్డీ చెవుల్లో దూర్చడం వంటి అమానవీయ చిత్రహింసల్ని ప్రపంచ ప్రజలు వ్యతిరేకించాల్సిన ఆవశ్యకతను, నొక్కి చెప్పడానికి బ్లమ్ ఎంచుకున్న రచనా మార్గం అభినందనీయమే కాదు. ఆ క్రమంలో అమెరికా వ్యతిరేకీయుల్ని కూడ గట్టాలన్న ఆలోచనా ఉన్నతమైందిగా పాఠకుడు ఫీలవుతాడు. రచయిత స్టేట్ డిపార్ట్‌మెంట్‌లో పనిచేసిన అనుభవంతో రాసిన 'టెర్రరిస్ట్ గెస్ట్‌హౌజ్' అనే వ్యాసంలో అమెరికా చేస్తున్న, చేసిన మానవహక్కుల ఉల్లంఘన పోలీసుపెత్తనాన్ని సూక్ష్మంగా తెల్పారు.

ఏ మాత్రం మానవ విలువల్ని పాటించకుండా తన దేశంలోని, ఇతర దేశాల్లో జీవరసాయనాలతో ప్రజల్ని అనేక రుగ్మతలకు గురిచేసిన విధానాన్ని, ఏ ఒక్కరూ క్షమించలేని విధానాన్ని ప్రపంచ ప్రజలకు తెలియజెప్పిన రచయిత ధైర్యం, ఆశయం, మానవరహిత ప్రపంచం దిశగా అమెరికా వేస్తున్న అడుగుల్ని విమర్శించడం వంటి వాటిపై రెండవ భాగంలో బ్లమ్ వ్యాసాలు విమర్శనాత్మకంగా, విశ్లేషణాత్మకంగా ఉన్నాయి. నేషనల్ ఎండోమెంట్ ఫర్ డెమోక్రసీ ఏర్పాటు వెనకున్న కుట్రనీ, కుతంత్రాన్ని బట్టబయలు చేయడమే కాకుండా దాని వెనకున్న అమెరికా అదృశ్యహస్తాన్ని ప్రపంచ ప్రజలకు చూపించాడు రచయిత. మూడవ భాగంలో అమెరికా ఇతర దేశాల్లో జోక్యం చేసుకున్న సంక్షిప్త చరిత్ర చేర్చారు. ఇరాన్, ఫిలిపిన్స్, మధ్య ప్రాచ్యం, రోస్టారికా వంటి దేశాల కమ్యూనిస్ట్ ఆలోచనల్ని కొల్లగొట్టే చర్యల్ని బ్లమ్ సూక్ష్మంగా వివరించారు.

ఇట్లాంటి విమర్శనాత్మక, విశ్లేషణాత్మక, నిజాయితీగల రచయితల రాతలు ఏ కొందరికో మాత్రమే కాకుండా ప్రపంచంలోని అందరికీ చేరేలా ప్రయత్నాలు జరగాలి. ఆ క్రమంలో అమెరికా సామ్రాజ్యవాద, విష సంస్కృతిని విప్పిచెప్పే ఈ పుస్తకాన్ని తెలుగులోకి ఇంతసరళంగా, ప్రాథమిక స్థాయి అక్షరాస్యునికి సైతం అర్థమయ్యేట్లు అనువదించిన ముక్తవరం పార్థసారధి అభినందనీయుడు. మరిన్ని పుస్తకాల్ని అమెరికా చేస్తున్న, చేసిన సామ్రాజ్యవాద క్రియల్ని వివరించిన రాతల్ని తెలుగు పాఠకులకు అందించాల్సిన బాధ్యతను తన భుజస్కందాలపై వేసుకున్న ప్రజాశక్తి బుక్‌హౌస్ పాఠకుల్లో పదికాలాలు నిలిచి వుంటుందనడంలో సందేహంలేదు.

-సైదులు ఐనాల

కథా వ్యాసుడు

కథా వ్యాసుడు శ్రీ మధురాంతకం రాజారం గారి కథలను సూక్ష్మంగా పరిశీలిస్తే కుటుంబ సంబంధాలు, మానవ సంబంధాలుగా గోచరిస్తాయి. వాటిని విస్తృతమైన వైవిధ్యంతో లోకానుభవాన్ని రంగరించి తీర్చిదిద్దిన కథలుగా మనకు తెలియని లోకాన్ని చూపుతాయి. మనలో వున్న అశాంతిని, అవకాశవాదాన్ని బహిర్గత పరచి అన్నింటికి అతీతమైన ఉన్నత విలువల గురించి ప్రేమానురాగాల గురించి తెలియజేస్తాయి.

స్నేహితుల్లాగా మసులుకునే భార్యాభర్తల ఆదర్శ దాంపత్యాన్ని "బంగారుపొయ్యి"లో చూడవచ్చు. "కాలం తెచ్చిన మార్పు" లో వర్ణాంతర వివాహాన్ని ప్రోత్సహించిన తండ్రి కథ ఒకటయితే, పెద్దింటి అమ్మాయిని పెళ్ళి చేసుకుంటూ కన్నతండ్రినే పిలవని పెళ్ళి కొడుకు కథ మరొకటి. కొడుకు ప్రేమ వివాహంలో తండ్రిని తప్పించుకోవాలని ప్రయత్నిస్తుంటే కొడుకుకు చేయూత కావాలని ఆ తండ్రి ప్రయత్నిస్తారు. తండ్రి నిక్కచ్చితనం, కొడుకు అతి తెలివిని వీటన్నింటికి అతీతంగా వాళ్ళ మధ్యవున్న అనుబంధాలను అద్భుతంగా చిత్రీకరించిన కథ "ఆకస్మిక తనిఖీ". మనుషుల్లో పెరిగిపోతున్న అవకాశవాద ధోరణులు, డబ్బు అంతస్తులే సర్వస్వంగా భావించే మనుషుల మనస్తత్వాలు, స్వసుఖానికే ప్రాధాన్యతనిచ్చి ఇంటిని పట్టించుకోని మగవాళ్ళు, విస్తరిస్తున్న వ్యాపార మనస్తత్వాలను చిత్రికరించిన కథలలో రచయిత లోకానుభవము, సునిశిత పరిశీలన మనల్ని ఆశ్చర్య పరుస్తాయి. ఎన్ని వేషాలేసి, ఎన్ని మోసాలుచేసి సినీ పరిశ్రమలో అడుగు పెట్టినా, అది ఎప్పటికైనా "పులి మీద స్వారీ" లాంటిదేనని తేల్చేస్తారు. కాలం మారుతుంది. చదువులు, ఉద్యోగాలవల్ల ప్రజలు తెలివిమీరిపోయి, తన ప్రాధాన్యత తగ్గిపోయిన తరుణంలో తన పిల్లలు షెడ్యూల్‌కాస్ట్ పిల్లలుగా సర్టిఫికెట్లను సృష్టించుకోవడానికి సమాయత్తమైన గ్రామ పెత్తందారు కథ "యక్ష ప్రశ్న".



మధురాంతకం రాజారం
వెల: రూ. 130/-
పేజీలు:317
ప్రతులకు: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, ఆబిడ్స్,
హైదరాబాద్

అపరాధ భావనతో భయాందోళనల 'సుడిగుండం'లో చిక్కుకొని కన్నుమూసిన తాసిల్దారు కథ గొప్ప మనో విశ్లేషణాత్మక కథగా చెప్పుకోవచ్చు. అందరూ వుండి అనాథలా బతికిన వసంత, చివరకు ఒక అనాథను చేరదీయడం 'వాఘీరా' కథగా రూపు దాల్చింది. స్త్రీల మనోభావాలను, వాళ్ళ అంతరంగాలను గుర్తించడం ఎంత కష్టమో "అన్నయ్య అంతరంగం"లో చూపించినా, తన జీవితాన్ని తానే చక్కదిద్దుకున్న యువతి అబలకాదు "సబల" అని చాటి చెపుతారు. ఈ కథలన్నింటిలో చూపిన మానవ మనస్తత్వాల విశ్లేషణ పాఠకులను ఎంతగానో ఆకట్టుకుంటుంది.

ఫ్యాక్షనిస్టు పగలను చిత్రీకరించిన రెండు కథలూ వైవిధ్యభరితమైనవే. కసాయి తండ్రి పంపిన కిరాయి హంతకుల నుండి భర్తను కాపాడుకున్న నాగతులసి ఔదార్యం, గొప్పతనం ముందు కర్కశత్వమే తలవంచకతప్పదని "కొండారెడ్డి కూతురు" నిరూపిస్తుంది. ఇద్దరు ఫ్యాక్షనిస్టులు పగలు మరచి స్నేహంగా ఉండటానికి అమెరికా కోడలు చేసిన మంత్రాంగం "గాలివాడ నుంచి న్యూయార్క్‌దాకా" నడిపిస్తుంది. అస్పృశ్యతను పాటించే పాత దేవాలయంలో ఒక దళిత కలెక్టర్ అభిషేకంతో అంటరానితనం పారి పోయిన వైనాన్ని "రాయలసీమ గబ్బిలం" తెలియజేస్తుంది.

భాషాపరంగా చూస్తే తొలినాటి తెలుగు కథకుల తర్వాత సజీవమైన భాషతో, అన్యభాషా పదాలు లేకుండా సులభశైలిలో పాఠకులను ఆకట్టుకునే విధంగా వ్రాయడంలో మధురాంతకం రాజారాం గారి ప్రత్యేకతే వేరు. కథల పట్ల ఆసక్తి ఉన్నవారు, కథలు రాయాలనుకునేవారు తప్పకుండా చదవాల్సిన పుస్తకమిది.

- కె.పి. అశోక్‌కుమార్

స్వీకారం

సినిమాలోచన
కిరణ్మయి
వెల: రూ. 50/-
పేజీలు:104
ప్రతులకు: అన్ని ప్రముఖ బుక్‌స్టాల్స్‌లో లభించును

స్వతంత్ర యోధుల సమర గాథలు
వెల: రూ. 100/-
పేజీలు:139
ప్రతులకు: ప్రజాశక్తి బుక్‌హౌస్
1-1-187/1/2,
చిక్కడపల్లి
హైదరాబాద్

పర్యాటకులకు స్వర్గం కర్నూలు జిల్లా

పాతరాతి యుగం నుంచి కర్నూలు జిల్లాకు చరిత్రలో ఒక స్థానం ఉంది. కర్నూలు జిల్లా భౌగోళిక పరిస్థితులు కూడ దానికి దోహదపడ్డాయి. ఆంధ్రప్రదేశ్ టూరిజం మ్యాపులో రెండవ స్థానాన్ని కలిగి వున్న కర్నూలుకు మొదటి స్థానాన్ని పొందే అర్హత పుష్కలంగా వుంది.

కర్నూలు చారిత్రక ప్రదేశం. గత చరిత్రకు సాక్ష్యాలు కోకొల్లలుగా దొరుకుతాయి. మౌర్యుల నుంచి నిన్నటి నిజాం వరకు అనేక చారిత్రక ఘట్టాలు కనిపిస్తాయి. దానికి సాక్ష్యాలు కర్నూలులోని కొండారెడ్డి బురుజు, గోల్ గుంబాజ్, దాదాపు ప్రతి ఊరిలో కోటగోడలు, బనగాన పల్లెలో పంచమహల్, ఎర్రగుడిలో (జొన్నగిరి) అశోకుని శాసనాలు, యాగంటిలో నవాబు బంగ్లా, స్టాంటన్‌పురం చర్చి, పేరుకు మహబూబ్ నగర్ జిల్లా అయినా కర్నూలుకు సమీపంలోని అలంపూర్ చాళుక్యుల కట్టడాలు 14 వందలేండ్లు అయినా ఇప్పటికి అవి అబ్బురాలే. ఇంకా వెలుగు చూడని అనేక ప్రాంతాలు జిల్లాలో గోచరిస్తాయి.

ద్వాదశ జ్యోతిర్లింగాలలో ఒకటైన శ్రీశైల భ్రమరాంబికా దేవాలయం, శక్తి పీఠాల్లో ఒకటైన అలంపూర్ జోగులాంబ దేవాలయం, దేశంలోని అనేకమంది భక్తులను ఆకర్షిస్తున్న మంత్రాలయ రాఘవేంద్ర స్వామి, ఆత్మకూరు దగ్గర కొలను భారతిలోని సరస్వతీ దేవాలయం, నందికొట్కూరులోని సూర్యదేవాలయం, దేశవ్యాప్తంగా ప్రఖ్యాతి గాంచిన మహానంది. ఉగ్రనరసింహుడు అవతరించిన అహోబిలం, భక్తులను విశేషంగా ఆకర్షిస్తున్న యాగంటి, మద్దిలేటి స్వామిల ప్రాకృతికా దృశ్యకావ్యాలు, బనగానపల్లెలోని బ్రహ్మంగారి మఠం, హైవేలో ఉండి అందరినీ ఆకర్షిస్తున్న బుగ్గరామేశ్వరం. అలాగే నందవరం చౌడేశ్వరి దేవీ ఆలయం, చిప్పగిరిలోని జైన దేవాలయం, స్టాంటన్ పురం చర్చి, దేశంలోనే షిర్డికన్నా ముందుగానే కట్టబడ్డ నక్షత్ర ఆకారంలోనున్న కర్నూలులోని షిర్డిసాయిబాబా ఆలయం, బాలసాయి ఆశ్రమం, ఇంకా వెల్దుర్తి దగ్గరలోని బ్రహ్మగుండం, కోవెలకుంట్ల దగ్గర నయనాలప్ప, ఆదోని దగ్గర ఉరుకుంద ఈరణ్ణ, దేవరగట్టు, ఎల్లార్తి ఇలా ప్రఖ్యాతి గన్నవే కాక ఇంకా అనేక దేవాలయాలు, దర్గాలు, చర్చీలు కర్నూలు జిల్లా అంతా కలిగి ఉన్నాయి.

ఇక ఇపుడు వినిపిస్తున్న పర్యావరణ టూరిజం అనే మాటకు కూడా కర్నూలు జిల్లా ప్రథమ స్థానం వహిస్తూంది అనటంలో ఏమాత్రం సందేహం లేదు.

ప్రపంచ ప్రఖ్యాతి నొందిన బనగానపల్లె దగ్గరలోని బెలుంగుహాలు. ఇపుడిపుడే వెలుగుచూస్తున్న ప్యాపిలి దగ్గరలోని బోయ వాండ్ల పల్లి, వాల్మీకి గుహలు, ఇవి బెలుంగుహాలకన్నా విస్తారమైనవని పరిశోధకులు పేర్కొంటున్నారు.



ప్రకృతి సౌందర్యాన్ని ఒలకబోసే నల్లమల అడవి, అందులోని టైగర్ వ్యాలీ, ప్రకృతి శోభతో అలరాలే అహోబిళం, యాగంటి, మద్దిలేటి, కొలను భారతి, బుగ్గరామేశ్వరం, పరిసర ప్రాంతాలు, రోళ్ళపాడు పక్షుల, జంతువుల సంరక్షణ కేంద్రం, ఓర్వకల్ దగ్గరలోని రాక్ గార్డెన్స్ జగన్నాథగట్టు.

ఆళ్ళగడ్డ శిల్ప కళా మందిర్‌లు, పత్తికొండ సాయిబాబా ఆలయం పార్కు, ఆదోనిలో చేనేత ఎక్స్‌పోర్టు కేంద్రం, చిప్పగిరిలోని అనేక దేవాలయాలు కర్నూలులోని కిసాన్‌ఘాట్, ఆర్కియాలజికల్ మ్యూజియం, మినీ ట్యాంక్‌బండ్‌గా పేరుబడ్డ కె.సి.కెనాల్ ఒడ్డున గల సత్యనారాయణ దేవాలయ (బిర్లా టెంపుల్) బ్రహ్మంగారి మఠం, వినాయక గుడి, అయ్యప్ప దేవాలయం, కాలువ గట్టుమీద రసరమ్య శిల్పాలు మరియు ఆ వైపు పార్కు, సాయంత్రాలకు నెలవైన చోటు తుంగభద్ర మీద రైల్వేబ్రిడ్జి ఓ అద్భుతం. అబ్దుల్ వహాబ్ ఖాన్ టోంబ్. గోలేనవాజ్. అతి ముఖ్యంగా కర్నూలు, మన ఆంధ్ర మొదటి రాజధాని. దాని ఆనవాళ్ళు మనం చూడవచ్చు.

ఈ విధంగా కర్నూలు జిల్లా అన్ని రకాలుగా పర్యాటకులను ఆకర్షించడానికి, అనువైన ప్రాంతం. దీన్ని టూరిజం ప్రాంతంగా ఇంకా అభివృద్ధి చేస్తే టూరిజం అభివృద్ధి చెంది యువతకు ఉపాధి. టూరిస్టుల వలన మరికొంత మందికి ఉపాధి దానిద్వారా ఆర్థిక సంపత్తి పేరు ప్రఖ్యాతులు వస్తాయి.

- కొట్టే చెన్నయ్య,
హిస్టరి లెక్చరర్



శ్రీశైలంలోని దేవాలయం

బెలుంగుహాలు

నటుడు, శాంతిసైనికుడు సునీల్‌దత్

పైడిముక్కల ఆనంద్‌కుమార్

బాలీవుడ్ కథానాయకుడు కేంద్రంలో క్రీడలు, యువజన వ్యవహారాల శాఖా మంత్రి సునీల్‌దత్ 25 మే 2005 బుధవారం ఉదయం తెల్లవారుజామున నిద్రలోనే కన్నుమూశారు. 1984లో ముంబాయి వాయువ్య నియోజకవర్గం నుంచి ఎనిమిదవ లోక్‌సభకు ఎన్నికై ఆ తర్వాత మరో నాలుగు సార్లు ఆ నియోజకవర్గం నుంచి లోక్‌సభకు ప్రాతినిధ్యం వహించారు. సునీల్‌దత్‌ని రాజకీయ నాయకుడిగా కంటే ఒక గొప్ప సామాజిక కార్యకర్తగా, శాంతినభిలషించిన వ్యక్తిగా, ప్రముఖ చలనచిత్ర నటుడిగా అందరూ గుర్తుంచుకుంటారు.

సినీరంగాన్ని రాజ్‌కపూర్, దిలీప్‌కుమార్, దేవానంద్‌లు ఏలుతున్న రోజుల్లో తన కంటూ ఒక స్థానాన్ని ఏర్పర్చుకున్న గొప్ప నటుడు సునీల్‌దత్. ఆయన నిర్మించి నటించిన 'ముఝే జీనదో' ఒక సంచలన చిత్రం. ఒక బందిపోటు జీవిత చిత్రణ. తెలుగింటి ఆడపడుచు వహీదారెహమాన్ ఈ చిత్రంలో కథానాయిక పాత్ర పోషించింది. ఈ చిత్రం చూసిన తర్వాత చంబల్ లోయలోని బందిపోట్లు ఆ రోజుల్లో జయప్రకాశ్ నారాయణ్ ముందు లొంగిపోవటంతో శాంతి సామరస్యాలు ఏర్పడ్డాయని అందరూ చెప్పుకుంటారు. ఆయనదే మరో స్వంత చిత్రం 'యాదే' (జ్ఞాపకాలు) ప్రపంచ వ్యాప్తంగా అభినందనలు పొందింది. ఈ చిత్రంలో అతడొక్కడే నటుడు. ఇలా ఒక్క నటుడితోనే నిర్మించబడిన చిత్రం ప్రపంచంలో మరెక్కడా లేదు. కేవలం ఆత్మాశ్రయ సంభాషణలతో(మోనోలోగ్) మరే ఒక్క మోహమూ కనపడకుండా గంటన్నరపైబడి చిత్రం సాగుతుంది. చివర్లో షాడోగా(నీడగా) నర్గీస్ కనబడుతుంది. ప్రయోగాలకు వెనుకాడని సునీల్‌దత్ మనస్తత్వం ఈ చలన చిత్రంలో మనకు దర్శనమిస్తుంది. సునీల్‌దత్ ఒక విలక్షణ నటుడు. 'జిందగి కే సఫర్ మే అకేలే హై హమ్..' అంటూ రఫీ గొంతుకతో పాడినా అతడెప్పుడూ ప్రజల మధ్యనే ఉన్నాడు. 'ఆమ్రపాలి' చిత్రంలో చక్రవర్తిగా చారిత్రక పాత్రలో కనిపించినా, ఒంటరితనాన్ని భరించలేని భర్తగా 'యాదే'లో జీవించినా, భూస్వామిని ఎదుర్కొనే రెబల్‌గా 'మదర్ ఇండియా'లో నటించినా, ప్రేమించిన ప్రియురాలిని పదలలేక ఆమె పరాయివాడ్ని చేసుకున్నప్పటికీ అక్రమ సంబంధాన్ని కొనసాగించే ప్రియుడిగా 'గుమ్రాహ్' (దారితప్పినది)లో కనపడినా, కిశోర్‌కుమార్, మహమూద్ లాంటి గొప్ప హాస్యనటుల మధ్య 'పడోసన్' (పక్కింటి అమ్మాయి)లో హాస్యపాత్ర పోషించినా, కేర్‌ఫ్రీ లాయర్‌గా 'వక్త్' (సమయం)లో నటించినా, తన కొడుకు సంజయ్‌దత్‌కే తండ్రిగా కనిపించే తన చివరి చిత్రం 'మున్నాభాయ్ ఎంబిబిఎస్'లో దర్శనమిచ్చినా అతడి విలక్షణమైన శైలి ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. 1956లో 'ప్లాట్‌ఫాం' చలన చిత్రంలో ప్రారంభమైన అతడి నట జీవితం 2003లో 'మున్నాభాయ్ ఎంబిబిఎస్' వరకూ అధిక భాగం విజయవంతంగానే సాగింది. అతడు



యువజన వ్యవహారాల కేంద్రమంత్రిగ సునీల్‌దత్

నిర్మించి, నటించిన 'రేష్మా ఔర్ షేరా' పరాజయం పాలైన తర్వాత అతడు చిత్రాల్లో కనపడటం మందగించింది.

రాజ్‌కపూర్ హీరోయిన్‌గా పేరుబడిన నర్గీస్ 'మదర్ ఇండియా' చిత్రం సెట్‌లో మంటల్లో చిక్కుకుంటే ధైర్యసాహసాలతో రక్షించి రియల్‌హీరో అయి ఆమె ప్రేమలో పడ్డాడు. సునీల్‌దత్ ఆ చిత్రంలో నర్గీస్ సునీల్‌దత్‌కి తల్లిపాత్రను పోషించింది. 1929 జూన్ 6న జన్మించిన సునీల్‌దత్ తనకంటే వయసులో పెద్దదైన నర్గీస్‌ని వివాహమాడాడు. నర్గీస్ ముస్లిం. తన వ్యక్తిత్వానికి మతం హద్దుకాదని ఆ రోజుల్లో నిర్ద్వంద్వంగా ప్రకటించిన వాడు సునీల్‌దత్. సురైయా, దేవానంద్‌లు మతం కారణంగా వివాహం చేసుకోలేక పోయారన్న విషయం ఆ రోజుల్లో విదితమే. సమాజంలో మతం, కులం పాత్రని తన వివాహం ద్వారా నిరసించాడు. రాజ్యసభ సభ్యునిగా నామినేట్ చేయబడిన నర్గీస్ తన పదవీ కాలం తర్వాత కేన్సర్‌తో మృత్యువాత పడటం ఆయనను ఎంతోగానో గాయపరిచింది. నర్గీస్‌దత్ ఫౌండేషన్ స్థాపించి కేన్సర్ బాధితులకు ఔషధాలు, పరికరాల సరఫరా కోసం పాటుపడ్డాడు. ఇమ్రాన్‌ఖాన్ తన తల్లిపేర పాకిస్థాన్‌లో నిర్మించ తలపెట్టిన కేన్సర్ ఆస్పత్రికి నిధులు సేకరించటానికి తోడ్పడ్డాడు. కెన్యాలో కూడా ఒక కేన్సర్ ఆస్పత్రికి సాయం అందించాడు.

ఖుర్ద్ గ్రామం, ఝులం జిల్లా, పాకిస్తాన్‌లో జన్మించిన సునీల్‌దత్‌కి మతఘర్షణలు ఎంతటి మారణహోమం సృష్టించాయో అనుభవమే. స్వతహాగా శరణార్థి అయిన ఆయనలో ఆ సంఘటనలు ద్వేషాన్ని రగిలించక శాంతి సామరస్యాల ఆవశ్యకతను గుర్తింపజేశాయి. 1987లో పంజాబ్ అల్లర్ల మధ్య ఏ రాజకీయ నాయకుడూ సాహసించని తరుణంలో తన కుమార్తె ప్రియతో కలిసి మరో ఎనభైమందిని వెంటేసుకుని ముంబాయి నుంచి అమృత్‌సర్ వరకు 2000 కిలోమీటర్లు శాంతి కోసం పాదయాత్ర నిర్వహించి స్వర్ణదేవాలయంలో ప్రార్థనలు జరిపాడు. 1988 నాగసాకి నుంచి హిరోషిమా వరకు అణ్వాయుధాల తయారీకి నిరసనగా యాత్ర నిర్వహించాడు. 'సరిహద్దులు దాటిన స్నేహ హస్తాలు' అనే కార్యక్రమం పేరిట బృహత్తర శాంతియాత్రలో భాగంగా శ్రీలంక నుంచి మొదలిడి భారతదేశం, బంగ్లాదేశ్, భూటాన్, నేపాల్ వరకు శాంతియాత్ర కొనసాగించాడు. అందుకే అనేక బహుమతులు గుర్తింపులు ఆయన్ను వెదుక్కుంటూ వచ్చాయి. 1968లో నటనకుగాను 'పద్మశ్రీ'తో భారత ప్రభుత్వం సత్కరించింది. జాతీయ సమైక్యత, మతసామరస్యం కోసం పాటుపడిన వ్యక్తిగా ఆయనకు 1997లో అబ్దుల్‌కలాం ఆజాద్ సత్కారం లభించింది. అదే సంవత్సరం అంతర్జాతీయ శాంతికి, మతసామరస్యత కు పాటుపడినందుకు ఖాన్‌అబ్దుల్ గఫార్ ఖాన్ అవార్డు లభించింది.



క్వారీ కార్మికులు

కొండ గుండెల్ని పెకలించి
మీ భవనాలకు పునాదిరాళ్లయ్యేది వాళ్లు
కండల్ని కరిగించి మీ గోడలకు
సిమెంట్ పూతయ్యేదీ వాళ్లే
రక్తాన్ని చెమటగా కార్చడమే వాళ్లకు తెలుసు
రెక్కాడితేగానీ డొక్కాడని రాతిబతుకులు
శిలల్లో శిలలుగా కలిసిపోయి
ఎండా వానలకు ఛిద్రమైపోయే జీవచ్ఛవాలు
సుతిమెత్తగా సాగిపోయే
మీ వాహనాల చక్రాలకింద
తార్రోడ్డు అడుగున అణిగిమణిగి
ఉండే కంకరరాళ్లూ వాళ్లే
మీ సుకుమారమైన పాదాలు కందిపోకుండా
మీ పాదాల అడుగున పాలిష్ పెట్టుకున్న
మొజాయిక్ చిప్స్ అయ్యేదీవాళ్లే
చివరకు సత్తువ సడలిపోయి
ఒడలు కమిలిపోయి
రక్తం ఆవిరై
నాలుగు పదులు నిండకముందే
ఎనభయ్యేళ్ల వృద్ధాప్యాన్ని తొడుక్కొని
ఏ టీబి మహమ్మారికో, కేన్సర్ రక్కసికో
బలైపోయేదీవాళ్లే

- భూస అప్పలరెడ్డి

గ్లోబల్ సునామీ



కళ్లెదుటే కళేబరాలు
కనుమరుగవని సునామీలు
ప్రపంచీకరణ వాకిట్లో
పాపాల భైరవుల వికటాట్టహాసాలు
కెరీరిజం కౌగిట్లో
మసిబారుతున్న పసితనాలు
పదవీదాహాల నడుమ
పట్టని ప్రజాక్రందనలు
వ్యవస్థతోనే అవస్థలు
అంతరిస్తాయా, అఘోరిస్తాయా
తేల్చాల్సింది మన చేతలు

-మురళీకృష్ణ పులిజాల

మరణంతో... కరచాలనం!

మృత్యు కౌగిలిలో
మరణం కోసం ఎదురుచూస్తోన్న
నీతో కరచాలనం
మరణంతో సహవాసంలాగుంది!
మందుల ధరలకు రెక్కలు తొడిగి ఎగరేస్తూ
జీవచ్ఛవాలనుకూడా పీక్కుతిని బలవాలనుకుంటున్న
బహుళజాతి రాబందులను తుదముట్టించాలని
మనమిద్దరం కలసినప్పుడు నీతో కరచాలనం
మరణంతో సహవాసంలాగుంది!
హెచ్.ఐ.వి. వైరస్ నిన్ను కబళిస్తుంటే
లాభాల వేటలో మల్టీనేషనల్ మందుల కంపెనీలు
సమాజాన్నే కబళిస్తుంటే
నీకోసం నాకోసం రాబోయే తరాలకోసం
పేటెంట్ల పన్నాగాన్ని ఎదిరించాలని
మనమిద్దరం కలసినప్పుడు
నీతో కరచాలనం మరణంతో సహవాసంలాగుంది!
ఈ పేటెంట్ వ్యవస్థను ధ్వంసించగ
పేటెంట్ల పన్నుగడను భగ్నం చేసేందుకు
పేషెంట్లయినా
పోరుబాట పడతారు!

("నూతన పేటెంట్ చట్టం"కు వ్యతిరేకంగా
"గ్లోబల్ యాక్షన్‌డే" సందర్భంగా)
హెచ్.ఐ.వి పేషంట్లకు అంకితం...

- ఎ. సత్య భాస్కర్

ADVOCATE

న్యాయసలహాలు

జి.ఎల్.నరసింహారావు, హైకోర్టు న్యాయవాది

పసుపుకుంకుమల స్థలం- రిజిస్ట్రేషన్

ఒకాయన ఒక ఖాళీ స్థలాన్ని 6-7-1967లో కొన్నాడు. వేరొకాయన నుండి మా అమ్మగారు. 14-8-1989న అదే స్థలాన్ని కొన్నారు. ఇప్పుడు ఆ ఖాళీస్థలాన్ని నాకు (అంటే కూతురు) పసుపు కుంకాల క్రింద ఇచ్చినారు. పై వారెవరూ ఆ స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేయించుకోలేదు. అందరి వద్దా కొన్నట్లు అగ్రిమెంట్ కాగితాలు మాత్రమే ఉన్నాయి. అయితే ఆ ఒకాయన కాని, వేరొకాయన కాని, వారి భార్యలు కాని జీవించి లేరు. రెండో ఆయనకు ఒక కొడుకు, ఒక కూతురు మాత్రం ఉన్నారు.

ఆ స్థలంలో మేము ఇల్లు కట్టుకోవాలనుకుంటున్నాము. దానికి బ్యాంకు నుండి హౌసింగ్ లోన్ తీసుకోవాలి. దానికి బ్యాంకు వారు రిజిస్ట్రేషన్ కావాలంటున్నారు. పైవారిద్దరి ప్రమేయం లేకుండా మా అమ్మగారు రిజిస్ట్రేషన్ చేయించితే ఖర్చు తగ్గుతుందని అంటున్నారు. నిజమేనా? రిజిస్ట్రేషన్ ఎలా చేయించితే బాగుంటుంది. సలహా ఇవ్వగలరు.

ఎస్.కె. హలీమా,
ఖమ్మంజిల్లా.

ఇంతకు ఆ స్థలం రికార్డుల ప్రకారం ఎవరిపేరు మీద ఉన్నదో తెలియచేయలేదు. మీ అమ్మగారి పేరుతో ఖాళీ స్థలం కొన్నట్లు అగ్రిమెంటు కాగితం ఉన్నదా? ఇప్పుడు మీ పేరుతో రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి ఈ ఖాళీస్థలం ఇప్పుడు మీ అమ్మగారి స్వాధీనంలో ఉన్నదా? మీ అమ్మగారి స్వాధీనంలో 1989 సంవత్సరము నుంచి ఉన్నది కదా అగ్రిమెంటు కాగితం ఉండి స్థలం మీ అమ్మగారి స్వాధీనంలో ఉంటే రిజిస్ట్రేషన్ చేయించుకోవచ్చును. రెండో ఆయన కొడుకు, కూతురుకు ఎలాంటి హక్కులేదుకాని, వారి సంతకాలు కూడా తీసుకుంటే పటిష్టంగా ఉంటుంది. ఆ ఖాళీస్థలము మీ స్వాధీనంలో అనగా పసుపుకుంకుమ క్రింద మీ స్వాధీనంలో ఉన్నదా? అలా ఉంటే మీ అమ్మగారు మీ పేరుతో రిజిస్ట్రేషన్ చేయించవచ్చు. వాటి ఖర్చులకు (రిజిస్ట్రేషన్) మీ దగ్గరలోని సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులో అడిగి తెలుసుకోండి.

మీరు ఎదుర్కొనే న్యాయపరమైన సమస్యలకు అనుభవజ్ఞులైన న్యాయవాదులు సలహాలు ఇస్తారు. ఈ సమస్యలతో సతమతమయ్యే పాఠకులు తమ ప్రశ్నలను ప్రజాశక్తికి పంపిస్తే వీలువెంబడి న్యాయవాదుల సమాధానాలు ప్రచురిస్తాము.

చిరునామా :
న్యాయసలహాలు
ఆదివారం అనుబంధం,
ప్రజాశక్తి దినపత్రిక, స్ట్రీట్ నెం. 1,
అశోక్‌నగర్, హైదరాబాద్ - 20

డి.ఇ.ఓ. పర్మిషన్‌తో హెడ్ మాస్టర్ నమోదు చేయవచ్చు

మేము బి.సి. (డి) కులమునకు చెందినవారము. తహసిల్దార్ సర్టిఫికేట్ పొంది ఉన్నాను. మా నాన్నగారు 6వ తరగతి చేరునపుడు ఓ.సిగా నమోదు చేయించారు. ఇంటర్ డిస్‌కంటిన్యూ చేశాను. ఉద్యోగములో చేరాను. (వాలంటరీ రిటైర్‌మెంటు పై పొందినాను) నా సర్వీసు రిజిష్టర్ నందు క్యాస్ట్‌కాలమ్ నమోదు పరచలేదు. తరువాత ప్రైవేట్‌గా డిగ్రీ, పి.జీ. పూర్తి చేశాను. ప్రస్తుతం పర్మినెంట్ క్యాస్ట్ సర్టిఫికేట్ పొందాను. ప్రస్తుతం నా ఎస్.ఆర్ నందు ప్రస్తుత హెడ్‌మాస్టర్ క్యాస్ట్ మెన్షన్ చేయవచ్చా. హెచ్.ఎమ్‌గారు నమోదు పరచనిచో నేను ఎవరిని ఏవిధంగా సంప్రదించాలో తెలుపగలరు.

శేషుకుమార్,
మార్టూరు, ప్రకాశం(జిల్లా).

మీ వివరమునుబట్టి మీ సర్వీసు రిజిష్టర్ నందు క్యాస్ట్ కాలములో భర్తీ చేయుటకు మీరు మీ హెడ్‌మాస్టర్‌తోగాని, డి.ఇ.ఓ. గారికిగాని అర్జీ పెట్టుకుని ఖాళీస్థలంగాఉన్న క్యాస్ట్ కాలమ్ పూర్తి చేయించుకోవలెను. డి.ఇ.ఓ పర్మిషన్ తీసుకుని మీ హెడ్ మాస్టర్ కూడ నింపవచ్చును.

రుచి

మరమరాలతో చాట్

కావలసిన పదార్థాలు:

మరమరాలు	:	1 కప్పు
కారం	:	చిటికెడు
ఉప్పు	:	చిటికెడు
నూనె	:	కొంచెం
కర్వేపాకు	:	1 రెబ్బ
ఉల్లిపాయ	:	ఒకటి
కొత్తిమీర	:	ఒక స్పూన్
నిమ్మరసం	:	1/2 స్పూన్

తయారుచేసే విధానం: ముందుగా పొయ్యిమీద బాణి పెట్టి కొద్దిగా నూనె వేయాలి. అది వేడయ్యాక మరమరాలు వేసి కొద్దిగా వేపాలి. తర్వాత ఉప్పు, కారం వేసి మరలా కొద్దిసేపు వేపాలి. కర్వేపాకు చిన్నచిన్న ముక్కలుగా చేసి వేసి కొద్దిసేపు ఉంచి దించేయాలి. తర్వాత ఉల్లిపాయ ముక్కలు, కొత్తిమీర, నిమ్మరసం వేసి బాగా కలిపితే మరమరాలతో చాట్ రడీ. ఇది వెంటనే తినాలి. లేకపోతే మరమరాలు మెత్తగా అయిపోతాయి. కావాలంటే ఇందులో టమాటా, క్యారెట్ కూడా చిన్న చిన్న ముక్కలుగా చేసి వేసుకోవచ్చు. చాలా టేస్టీగా ఉంటుంది. మరి మీరు కూడా ట్రై చేస్తారు కదా..

మ్యాంగో జ్యూస్

కావలసిన పదార్థాలు:

బంగినిపల్లి మామిడి	:	ఒకటి
పంచదార	:	1 కప్పు
నీరు (లేక) పాలు	:	1 గ్లాసు
ఐస్ ముక్కలు	:	కొన్ని

తయారుచేసే విధానం: బంగినిపల్లి మామిడి పండుకు పైన తొక్క తీసేసి సన్నగా ముక్కలు కోసుకోవాలి. మామిడి పండు ముక్కలు, పంచదార కలిపి మిక్సీలో వేసి బాగా మిక్స్ చేయాలి. దానిలో నీరు లేక పాలు కలిపి మళ్లీ మిక్స్ చేయాలి. గ్లాసులో పోసి రెండు ఐస్ క్యూబ్స్ వేసి సర్వ్ చేయండి. అబ్బ... ఎంత బాగుంటుందో.. ఇప్పుడు మామిడిపళ్ల సీజన్ కాబట్టి. ఎవరైనా అతిథులు ఇంటికి వస్తే. వెంటనే జ్యూస్ ఇవ్వాలంటే ఇది చాలా తేలిక మరి.. మరి మీరు కూడా ప్రయత్నిస్తారుగా..

విద్యార్థి, ఉద్యోగార్థుల సమాచార మార్గదర్శి

- ఇంగ్లీష్ కమ్యూనికేషన్ స్కిల్స్
- కొత్త కోర్సుల వివరాలు
- ఉద్యోగార్థులకు 'ఎంప్లాయ్‌మెంట్ ఆపార్చునిటీస్'
- 'కంప్యూటర్ ఛానెల్'లో ఐ.టి.న్యూస్
- విద్యావేత్త ఐఐటి రామయ్యగారి 'మాథ్స్ స్కిల్స్'
- పోటీ పరీక్షల మెటీరియల్, మోడల్ పేపర్స్
- కెరీర్ గైడెన్స్
- ప్రతివారం ఓ ప్రత్యేక సమాచారం
- 'వ్యక్తిత్వవికాసం'

దీపిక

చందాదారులుగా చేరండి

సమాచారం

మీ ముంగిట నిలుస్తుంది

ఇలా అందరికీ అవసరమైన సమాచారమందించే

ఏకైక విద్యా ఉద్యోగ వారపత్రిక

అమూల్యమైన సమాచారం అతి స్వల్పధరకే

దీపిక చందా వివరాలు

సంవత్సర చందా: ఏజెంటు ద్వారా రూ.150లు, పోస్టు ద్వారా రూ.160లు

అర్ధసంవత్సర చందా : ఏజెంటు ద్వారా రు.80లు, పోస్టుద్వారా రూ.85లు

మీ అడ్రసు తెలుపుతూ చందాలను ఎం.ఓ./డి.డి. రూపంలో పంపించగలరు.

మా అడ్రసు : 1-1-298/4, స్ట్రీట్ నెం.1, అశోక్‌నగర్, హైదరాబాద్. ఫోన్: 276645420, 27663761

మేనేజర్: 27673787, ఫ్యాక్స్: 2763921.

Website: www.prajasakti.com, e-mail: prajasakti@hotmail.com